ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 20 డిసెంబరు 2024 | 5



ప్రజల దేవుడు అంబేడ్కర్



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ పట్ల కేంద్ర మంత్రి అమిత్‌షా అమర్యాదగా మాట్లాడడం తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి అన్నారు.రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి గురువారం కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కోట్లాది మంది మనోభావాలు దెబ్బతీసేలా షా మాట్లాడారన్నారు. అంబేడ్కర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన అమిత్ షాను తక్షణమే చట్టసభల నుంచి బర్తరఫ్ చేయాలని స్వతంత్ర జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. వెంటనే షా క్షమాపణలు చెప్పాలన్నారు.



అమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో కోట సత్తెమ్మ తిరునాళ్ళు గురువారం ముగిశాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. - నిడదవోలు

గణేశుడికి లక్ష కుడుములు

బిక్కవోలు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన తాళ్ల పిచ్చిరెడ్డి గంగా దంపతులు గురువారం లక్ష కుడుముల నోము తీర్చారు. ముందుగా స్వామి వారికి అభిషేకం, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో తయారు చేసిన లక్ష కుడుములను స్వామికి సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి ప్రసాదంగా అందజేశారు.

ముగ్గురు ఏపీవోలకు షోకాజ్ నోటీసులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్యాటిల్ షెడ్స్ పనులకు నిర్దేశించిన 715 షెడ్స్‌లో ఇప్పటి వరకు లక్ష్యాలను చేరుకోవడంలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఏపీవోలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డ్వామా పీడీని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పనుల సమీక్షలో కలెక్టర్ క్యాటిల్ షెడ్స్‌పై ఆరా తీసారు. ఇప్పటి వరకు 73 షెడ్లు పూర్తి కాగా 40 రూఫ్‌లెవెల్, 150 బేస్‌మెంట్, 386 పునాదిలో ఉండడంపై వివరణ కోరారు. పనుల విషయంలో నిర్లక్ష్యం వహించిన రంగంపేట, కోరుకొండ, నల్లజర్ల, ఏపీవోలకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని పీడీని ఆదేశించారు. ఉపాధి హామీ పనులు డిసెంబరు నెలాఖరు నాటికి జిల్లాకి కేటాయించిన 44 లక్షల పనిదినాల్లో ఇప్పటివరకు 42లక్షల 90 వేలు పూర్తి చేశారని మిగిలినవి పూర్తి చేయాలన్నారు.సగటు వేతనం రూ.256గా చెల్లిస్తున్నామన్నారు. ఈ మొత్తం రూ.300 వరకు చేరేలా పనులు గుర్తింపు ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ పనులు నూరు శాతం జనవరి 12 కల్లా పూర్తి చేయాలన్నారు. 645 సీసీ రోడ్లు నిర్మాణ పనుల్లో 51 పూర్తికాగా 169 లేయర్ వరకు వచ్చాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.గ్రామాల వారీ పనులపై మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేపట్టాలన్నారు.సమీక్షలో డ్వామా పీడీ నాగమహేశ్వరరావు, ఇంజనీర్లు, ఏపీవోలు పాల్గొన్నారు.

అనపర్తిలో ఇద్దరు ఫీల్ట్ అసిస్టెంట్ల సస్పెన్షన్

అనపర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత పాలకులు ఉపాధి నిధులను పందికొక్కుల్లా మెక్కారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం 17వ ఉపాధి హామీ సామాజిక ప్రజా వేదిక నిర్వహించారు. 2023-24 సంవత్సరంలో అనపర్తి మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఈ నెల 10 నుంచి సోషల్ ఆడిట్ బృందం క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదికలను తయారు చేశారు. గతేడాది కాలంలో మండలంలోని 11 గ్రామాల్లో రూ.8.40 కోట్ల నిధులు ఖర్చు చేయగా వీటిలో వేతనాలకు రూ.5.10 కోట్లు, మెటీరియల్ కోసం 3.30 కోట్లు ఖర్చు చేసినట్టు పీడీ నాగమహేశ్వరరావు తెలిపారు. పలు గ్రామాల్లో మస్తర్ల విషయంలో అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. పెడపర్తి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ బోడపాటి వినయ్ ప్రతాప్ తన తల్లి, సోదరుడి పేరున కూడా జాబ్ కార్డులు సృష్టించి రూ.2.05 లక్షలు కాజేసినట్టు గుర్తించారు. ఫీల్డ్ అసిస్టెంట్ స్వయంగా అవినీతికి పాల్పడినట్లు అధికారుల ఎదుట అంగీకరించాడు. రామవరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్నందున ఇరువురిని సస్పెండ్ చేశారు. మస్తర్లతో కాజేసిన రూ.2.56 లక్షలు, పెనాల్టీ రూ.22 వేలు రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఏపీవో రామ్ ప్రసాద్, ఖాదర్ బాషా, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు వారా కుమారి, గొల్లు హేమతులసి, కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, డీసీ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి పాల్గొన్నారు.



పెడపర్తి, రామవరం ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

12:30 కాలేదు ఉద్యోగులు ఎక్కడమ్మా!

86వ సచివాలయానికి తాళం వేసి ఉండడంపై ఎమ్మెల్యే వాసు ఆగ్రహం

రాజమహేంద్రవరం సిటీ,డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం 45, 46 డివిజన్ల పరిధిలోని 83,84,85,86 సచివాలయాలను తనిఖీ చేసి ఎమ్మెల్యే విస్తుపోయారు. 86వ సచివాలయానికి తాళాలు వేసి ఉండడం చూసి మండిపడ్డారు. ఇంకా 12:30 గంటలు కూడా కాకుండానే సిబ్బంది ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు.అడ్మిన్ సెలవులో ఉన్నారని తెలుసుకుని..ఆపై బాధ్యత నిర్వహించాల్సిన లక్ష్మీ సూర్య అనే ఉద్యోగిని అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఫోన్ చేసి 86వ సచివాలయం ఉద్యోగులను మార్చాలని సూచించారు. వివిధ సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజలకు ఉద్యోగులు అందుబాటులో లేకపోతే ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు.మిగిలిన సచివాలయాల్లో రిజిస్టర్లను తనిఖీ చేశారు. పాతపద్ధతులు మార్చుకోవాలని సూచించారు.



సచివాలయ రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



కొవ్వూరు మండలం పంగిడి వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు హెల్మెట్ లేకపోవడంతో రోడ్డుకు తలతగిలి అక్కడికక్కడే ఇలా మృతిచెందాడు.

తల కెక్కించుకోండి!

హెల్మెట్ బరువు కాదు బాధ్యత

- హెల్మెట్ పెట్టుకోవాల్సిందే
- నిర్లక్ష్యాన్ని ఉపేక్షించొద్దు
- హైకోర్టు సీరియస్
- 6 నెలల్లో 84 మంది మృతి
- ఈ ఏడాదిలో 43 వేల కేసులు
- 11 నెలల్లో రూ.అర కోటి ఫైన్
- అయినా మారని జనం
- వాహనానికి హెల్మెట్ ఉచితమట?
- బిల్లుతో సరిపెట్టేస్తున్న షోరూమ్‌లు

లక్షలు పోసి బైక్‌లు కొంటారు.. వేగంగా వెళ్లిపోతారు.. హెల్మెట్ పెట్టుకోవడానికి ఇష్టపడరు.. శిరస్త్రానం అనేది బరువు కాదు బాధ్యత అని ఒక్కరూ ఆలోచించరు.. ప్రమాదాలు జరిగిన సమయంలో శరీరంలో ఎక్కడ దెబ్బలు తగిలినా దాదాపుగా ప్రాణాలకు ముప్పు ఉండకపోవచ్చు.. కానీ తలకు తగిలితే మాత్రం ఆ గ్యారంటీ లేదు.. క్షణాల్లో ఊపిరి గాల్లో కలిసిపోతోంది.. అదే హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణాలకు ముప్పు తప్పినట్టే. అయినా చిన్నచూపే.. ఈ ఏడాది 11 నెలల కాలంలో హెల్మెట్ పెట్టుకోలేని వాహనదారుల నుంచి రూ. అరకోటి వసూలు చేశారంటే నిర్లక్ష్యం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.. పోనీ ఫైన్ వేసిన పోలీసులైనా చెబుతున్నారా అంటే అదీలేదు.. ఫైన్ వేసి కనీసం హెచ్చరికలు చేయకుండా వదిలేస్తున్నారు.. దీనిపై ఉన్నత న్యాయస్థానం మండిపంది.. హెల్మెట్ ధారణపై చైతన్యం కల్పించాలని ఆదేశించింది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చిన్నపాటి లెక్కలేనితనం కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. లక్షలుపోసి వాహనాలు కొంటున్నవాళ్లు ఐదు వందలతో ప్రాణాలను నిలబెట్టే కవచం(తలకు) కొనడానికి తీవ్రంగా ఆలోచిస్తున్నారు. ప్రాణం విలువను హెల్మెట్ ఖరీదుతో పోల్చగలమా?.. హెల్మెట్ పెట్టుకోకుండా వహిస్తున్న నిర్లక్ష్యంతో ప్రతి ఏడాది వందలాది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వీరిలో యువత ఎక్కువగా ఉంటున్నారు. ఈ నిర్లక్ష్యాన్ని ఇక ఉపేక్షించేది లేదంటూ ఉన్నత న్యాయస్థానం రంగంలోకి దిగింది. హెల్మెట్ పెట్టుకోకపోతే ఖబడ్దార్ అంటూ హెచ్చరికలు జారిచేస్తోంది.

ఎంత చెప్పినా..

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, మిగతా వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలని పోలీసులు ఎంత చెప్పినా వాహన చోదకులు మాత్రం పెడచెవిన పెడుతున్నారు. కనీసం ఒక శాతం వాహన చోదకుల నెత్తిపై కూడా హెల్మెట్ కనిపించడం లేదు.హెల్మెట్ ఎక్కువసేపు పెట్టుకోవడం వల్ల చెమటచేరి జుట్టు పాడవుతుందని భయపడుతుంటారు. తలపై బరువుగా ఉన్నట్టు ఫీలవుతుంటారు. నాణ్యతా ప్రమాణాలు లేని హెల్మెట్ల వల్ల ఈ సమస్య ఉంటుంది. కాస్త ధర ఎక్కువైనా నాణ్యత కలిగిన హెల్మెట్‌ని కొనుక్కుంటే ఆ ఇబ్బంది ఉండదు.హెల్మెట్‌కి బట్టతలకు ఎలాంటి సంబంధమూ లేదని నిపుణులు చెప్పే మాట. కార్బన్, కెవ్లార్ వంటి వాటితో తయారు చేసిన ఐఎస్ఐ మార్కు నాణ్యమైన హెల్మెట్లను కొనాలి. సరైన వెంటిలేషన్ ఉన్న, తలకు తగిన సైజును ఎంపిక చేసుకోవడం వల్ల సౌకర్యంగా ఉంటుంది. హెల్మెట్ పెట్టుకోవడం బరువు కాదు.. బాధ్యతని పదే పదే గుర్తు చేసినా ఫలితం అంతంత మాత్రంగా కూడా లేదు.దీంతో కొరడా ఝుళిపించక తప్పని పరిస్థితి వచ్చేసింది. సాక్షాత్తూ హైకోర్టు సీరియస్ కావడంతో హెల్మెట్ ధారణపై యంత్రాంగం తదుపరి చర్యలకు సమాయత్తమవుతోంది. పోలీసులకు చలాన్లు రాయడంపై ఉన్న శ్రద్ధ వాహన చోదకుల్లో చైతన్యం తేవడంలో లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

6 నెలల్లో 84 మంది మృతి..

ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయమై చనిపోయిన వారి సంఖ్యను చూస్తే హెల్మెట్ ప్రాధాన్యమేమిటో అర్థమవుతుంది. ఈ ఏడాది జూన్ నుంచి డిసెంబరు 15వ తేదీ వరకూ హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల ఏకంగా 84 మంది దుర్మరణం పాలయ్యారు. వీరిలో యువకులు ఎక్కువగా ఉండడం మరింత విచారకరమైన విషయం.ఈ ఏడాది నవంబరు వరకూ హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారిపై పోలీసులు ఏకంగా 43 వేల కేసులు నమోదు చేసి రూ.43 లక్షలు జరిమానాగా విధించారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకూ గణాంకాలను చూస్తే ఈ స్టేషను పరిధిలో 20 కేసులు నమోదయ్యాయి.తర్వాత స్థానాల్లో కొవ్వూరు టౌన్ 18, ధవళేశ్వరం, కడియం 17 చొప్పున, గోకవరం 16, కోరుకొండ 14, ప్రకాశ్ నగర్, రాజానగరం, పెరవలి 12 చొప్పున,నిడదవోలు 11, సమిశ్రగూడెం, దేవరపల్లి, బొమ్మూరు 10, నల్లజర్ల 9, వన్‌టౌన్, బిక్కవోలు 8, అనపర్తి 7, కొవ్వూరు రూరల్, తాళ్లపూడి 6, చాగల్లు, రంగంపేట 5 చొప్పున, ఉండ్రాజవరం పీఎస్ పరిధిలో మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసుల వద్ద కూడా ద్విచక్ర వాహన ప్రమాదాల్లో తలకు గాయం కావడం వల్ల చనిపోయిన వారి వివరాలు స్పష్టం లేవని తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఓ ఆరు నెలల లెక్కలను కాగితానికి ఎక్కించారు. మిగతా వాటి కోసం కసరత్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరో (డీటీఆర్‌బీ) అనే విభాగం ఉంటుంది. డీటీఆర్‌బీని కేవలం ఒక్క ఉద్యోగి(మరో పర్యవేక్షణా ధికారి)తో నెట్టుకొస్తుండడాన్ని చిత్తశుద్ధి వెక్కిరిస్తోంది.

హైకోర్టు ఆదేశాలివే..

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై.. ముఖ్యంగా హెల్మెట్లు లేకపోవడం, ఇష్టానుసారం హారన్లు మోగిస్తుండడం, బాధ్యతారహిత డ్రైవింగ్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. 'హెల్మెట్ తప్పనిసరి చేస్తూ మేం ఇచ్చిన ఆదేశాలు ఎందుకు అమలు చేయడం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారనే సందేశాన్ని వాహనదారుల్లోకి బలంగా పంపించాలి. పోలీసులు రోడ్ల మీదకు వచ్చి వాహన రికార్డులు తనిఖీ చేసిన పుడే అది సాధ్యమవుతుంది. సీసీ కెమెరాలపై ఆధారపడి చలానాలను విధించడాన్ని తగ్గించి అక్కడికక్కడే జరిమానా వసూలు చేస్తే పరి స్థితిలో మార్పు వస్తుంది. పోలీసులు రోడ్లపై ఉంటే క్రిమినల్ చర్యలూ తగ్గుతాయి. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులను ఎంత మాత్రమూ ఉపేక్షించవద్దు.ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల రాష్ట్రంలో 667 మంది చనిపోయారు. మా ఉత్తర్వులు అమలు చేస్తే కొన్ని ప్రాణాలైనా నిలబడేవి' అని వ్యాఖ్యానించింది. పత్రికలు, టీవీలు,ఎఫ్ఎం రేడియోలు, సైన్ బోర్డులు, సినిమా హాళ్లలో ప్రకటనల ద్వారా చట్ట నిబంధనలపై ప్రజలను చైతన్యం చేయాలని పోలీసులను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది.

బండి కొంటే..హెల్మెట్ ఉచితమట!

కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు 1989లోని 138(3)(ఎఫ్) ప్రకారం ప్రతి ద్విచక్ర వాహనం అమ్మకం సమయంలో కొనుగోలుదారు డికి ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాలతో కూడిన రెండు హెల్మెట్లను ఉచితంగా ఇవ్వాల్సి ఉం టుంది. అయితే ఉచితంగా అందిస్తున్న దాఖ లాలు లేవు. వాహనదారుడికి హెల్మెట్లు ఇవ్వ కుండా రశీదులను మాత్రం ఆ రికార్డుకు జత చేస్తున్నారు. ఈ తతంగం అధికారులకు తెలిసినా 'ఎందుకో' ఏమీ పట్టించుకోవడం లేదు. అందుకే ఏడాదికి వందల్లో ద్విచక్ర వాహనాలు రోడ్లపైకి వస్తున్నా హెల్మెట్లు మాత్రం పదుల్లో కూడా కానరావడం లేదు. పైగా వాహనం కొన్న పుడు హెల్మెట్ కోసమంటూ రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకూ కొనుగోలుదారుడు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఒకవేళ అలా చెల్లించని పక్షంలో బిల్లు తెచ్చుకోవాలని చెబుతున్నారు.

మార్చి 17 నుంచి పది పరీక్షలు : డీఈవో

కడియం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి 17 నుంచి జరిగే పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. గతేడాది కడియం ఉన్నత పాఠశాల పది ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుందని, ఈ సారి జిల్లా స్థాయిలో ప్రథమస్థానాన్ని సాధించాలన్నారు.తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ సీ,డీ గ్రేడ్ విద్యార్థుల కోసం తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ప్రారంభించారు. ఈ మెటీరియల్ డీ, సీ, ఈ, బీ ద్వారా జిల్లా అంతా పంపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుడా సమస్యలపై నేడు ఓపెన్‌ఫోరమ్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రుడా పరిధిలో సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తున్నామని రుడా వీసీ కేతన్ గార్గ్ తెలిపారు.ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి రుడా కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

పట్టిసీమ టూ కొవ్వూరు జాతీయరహదారి 7



వర్గీకరణ వద్దు : కాకినాడలో మాలల నిరసన ప్రదర్శన



వర్గీకరణ ముద్దు : మాదిగ ఉపకులాల నినాదాలు

వర్గీకరణం

2468 మంది హాజరు.. 311 వినతులు

కాకినాడలో ప్రజాభిప్రాయ సేకరణకు ఉమ్మడి జిల్లా నుంచి

7

- ఎస్సీ వర్గీకరణపై ఉపకులాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ
- కాకినాడ విచ్చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- వర్గీకరణకు అనుకూలంగా.. వ్యతిరేకంగా మోహరించిన ఇరువర్గాలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ చైర్మన్ గురు వారం కాకినాడలో ప్రజాభిప్రాయసేకరణ చేశారు.దీనికిగాను ఆయన కాకినాడ కలెక్టరేట్‌కు విచ్చేశారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి విచ్చేసిన మాల, మాదిగ, రెల్లి,బుడగ జంగాల వంటి ఎస్సీ ఉపకులాల వారితో కలెక్టరేట్ కిక్కిరిసింది. పోటాపోటీ నిరసనలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఎస్సీ ఉపకులాలకు సంబంధించి వర్గీకరణపై ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా వినతులు స్వీకరించారు. ఆయా కులాల నాయకులు,ప్రజలు పోటాపోటీగా ధర్నాలు, నిరసనలు చేశారు. ఎమ్మార్పీస్ పోరాట ఫలితంగా ఉమ్మడి ఏపీలో 1997లో రామచంద్ర రాజు కమిషన్ వేశారని మాదిగ సంఘాలు గుర్తుచేశారు. ఆ కమిషన్ రిపోర్టు ప్రకారం 2000 నుంచి 2004 వరకు ఉమ్మడి ఏపీలో వర్గీకరణ అమలు జరిగిందని ఆయా సంఘాలు పేర్కొన్నాయి. ఉషామెహ్రా కమిషన్ 2008లో ఎస్సీ వర్గీకరణ అవసరమని ప్రకటించారని మాదిగ సంఘాలు తెలిపారు.



కాకినాడలో వినతులు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

వ్యతిరేకంగా నిరసనలు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు, మాలసంఘాలు నిరసనలు తెలిపాయి. వన్ మ్యాన్ కమిషన్ గోబ్యాక్ అంటూ మాలలు నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది. 1972 గణాంకాల ప్రకారం మాలలకు రిజర్వేషన్లు కేటాయించాలని అనుకోవడం సరైనది కాదని వారు అభ్యంతరాలు తెలిపారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్ విష్ణు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ఇంద్రపాలెం వంతెన వరకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

'ఊరెళితే ఫోన్ చేయండి'

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఊరెళ్తున్నారా.. మీ ఇల్లు జాగ్రత్త అంటూ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్ మాట్లాడుతూ పండగ సెలవులకు ఊరెళ్లే ప్రజలు ఇంటి భద్రత, నేరనియంత్రణకు పోలీసు సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. తాళాలు వేసిన మీఇంటి భద్రతకు లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు 9493206371, 99084 54580 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

28న సీపీఎం బహిరంగ సభ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం 24వ తూర్పుగోదావరి జిల్లా మహాసభలు ఈ నెల 28, 29 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగనున్నాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం శ్యామలాసెంటర్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద జిల్లా మహాసభల లోగోను ఆవిష్కరించారు.డిసెంబరు 28న ప్రజాప్రదర్శన మధ్యాహ్నం 2 గంటలకు మున్సిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండు సెంటర్ వరకూ జరుగుతుందని, అనంతరం కోటిపల్లి బస్టాండు సెంటర్లో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. 29న జరిగే ప్రతినిధుల సభకు జిల్లాలోని ప్రతినిధులంతా హాజరవుతారని వెల్లడించారు.




ఉడ్..డౌడ్!

సిమెంటు గుమ్మాలే ముద్దు

పెరిగిన వినియోగం - వ్యయ తగ్గింపులో భాగం

కలపకు ప్రత్యామ్నాయంగా వాడుక




పెరవలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేటు డూప్లికేటు అన్నట్టు.. ప్రతి దానికి ప్రత్యామ్నాయం వచ్చేసింది..ఇదీ అటు వంటిదే.. పూర్వం ఇంటి నిర్మాణంలో గుమ్మాలు, కిటీలకు కలపనే వాడేవాడు.. ప్రస్తుతం నాణ్యత కలిగిన కలప దొరకడమే గగనంగా మారింది..పోనీ కలప కొందామని వెళ్లినా గుమ్మాలు.. కిటికీలకే లక్షలు పోయాల్సిందే. అదే సిమెంట్ గుమ్మా లైతే వేలల్లో తేలిపోతోంది. రేటు తక్కువగా ఉండడం, దీర్ఘకాలం చెదలు పట్టకుండా ఉండ డం వంటి కారణాలతో ప్రస్తుతం ప్రతి ఒక్కరి చూపు అటు వైపే ఉంటుంది. కొంత మంది ప్రధాన సింహ ద్వారానికి టేకు,లేదా వేప లేదా ఇతర రకాల కలపతో తయారైన గుమ్మాలను పెట్టి మిగిలిన వాటిని సిమెంటు గుమ్మా లు అముర్చుతున్నారు.వాటికి తలుపులు ప్లైవుడ్ గాని,ఫైబర్ గాని తో తయారైన వాటిని బిగిస్తున్నారు. దీని వల్ల ఖర్చు ఆదా అవుతుందనేది గృహ నిర్మాణదారుల మాట. కలప గుమ్మాలు, కిటికీలు తయారు చేయించి అమర్చాలంటే లక్షలాది రూపాయలు వ్యయం చేయాల్సి వస్తుంది. ఖర్చును తగ్గించుకోవడం కోసం సిమెంటు గుమ్మాలు వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో సిమెంటు గుమ్మాలు,కిటికీల తయారీ పరిశ్రమలు పెరిగాయి. తూర్పుగోదావరి జిల్లా పెరవలిలో నాలుగైదేళ్లలో మూడు పరిశ్రమలు వెలిశాయంటే ఎంతగా డిమాండ్ వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. సిమెంటు గుమ్మం ఖరీదు సైజును బట్టి రూ.800 నుంచి రూ.1000 వరకు పలుకుతుండగా అదే కలపతో తయారు చేసిన గుమ్మం రూ.5 వేల నుంచి రూ.10 వేలు పలుకుతుంది. కిటికి సైజును బట్టి రూ.1000 నుంచి రూ.3 వేల వరకు సిమెంటు కిటికీలు ఉండగా కలపతో చేసినవి రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు ఉంటు న్నాయి. సాధారణ రకాలైతే ఇలా..మద్ది,టేకు.. ఎర్రచందనం తదితర రకాల కలపైతే ధర ఊహించలేం. దీంతో ఎక్కువ మంది సిమెంటు గుమ్మాలను పెట్టుకుంటున్నారు. కిటికీలకు ఐరన్ వాడుతున్నారు. వాటికి ఉడ్‌లా కనిపించేలా రంగులు వేస్తున్నారు.



రెండు మూడేళ్లగా వినియోగం పెరిగింది



సుమారు ఐదేళ్ల కిందట పెరవలిలో సిమెంటు గుమ్మాలు, కిటికీలు తయారీ పరిశ్రమ పెట్టా. గత రెండు మూడేళ్లగా వీటికి డిమాండ్ పెరిగింది. కర్ర గుమ్మాలతో పోలిస్తే వీటికి ఖర్చు తక్కువ.దీంతో చాలా మంది మక్కువ చూపుతున్నారు. ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాం.

- కలిదిండి శ్రీనివాస్, తయారీదారుడు, పెరవలి

కొంగల గుంపు.. సందడి..



కొంగలు గుంపులు.. గుంపులుగా సందడి చేశాయి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలోని ఒక పంట పొలంలో కొంగలు ఇలా సందడి చేశాయి. ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా వందలాది కొంగలు రైతులకు మేలు చేకూర్చేలా పొలంలోని పురుగులను తిన్నాయి. ఈ దృశ్యం కనువిందు చేసింది.

-ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి)

మహాకుంభమేళాకు.. వెళ్లిరండిలా!



ఆంధ్రజ్యోతి/సామర్లకోట

మహాకుంభమేళా చూడాలనుకుంటున్నారా? లక్షలమంది జనం.. భక్తితత్వంతో కూడిన భగవన్నామ స్మరణ.. అలాంటి దృశ్యం చూస్తేనే అద్భుతం.. అమోఘం.. దీన్ని కనులారా చూడాలనుకుంటే ఈ కథనంలోకి పదండి..

- ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనానికి భారత్ గౌరవ్ రైళ్లు
- మహాకుంభమేళా వీక్షణకు వచ్చేనెలలో 'మహా కుంభ్ పుణ్యక్షేత్ర యాత్ర' పేరిట ప్రత్యేక రైలు
- కాశీ, అయోధ్య, ప్రయాగ్‌రాజ్ దర్శించుకునే అవకాశం
- వచ్చేనెల 19న సికింద్రాబాద్‌లో మొదలై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీదుగా ప్రయాణం
- రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని రైల్వేస్టేషన్లలో హాల్టు
- మొత్తం 8రోజులపాటు ప్రయాణం

దేశంలో వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు భారత్ గౌరవ్ రైళ్లను భారత రైల్వే ఆధ్వర్యంలో ఐఆర్‌సీటీసీ నడుపుతోంది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిల్లో జరిగే కుంభ మేళాను వీక్షించేందుకు పలు రైళ్లను 'మహా కుంభ్ పుణ్యక్షేత్ర యాత్ర' పేరిట నడుపుతున్నారు. వీటిలో భాగంగా ఒక రైలు సికింద్రాబాద్ నుంచి వచ్చేనెల 19న బయలుదేరనుంది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణా నుంచి ఈ భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మీదుగా ప్రయాణించనుంది. దీనికి రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని హాల్ట్‌లు కేటాయించారు.

దేశవ్యాప్తంగా పలు రైళ్లు

వచ్చేనెల 19న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరనున్న ఈ రైలు 8రోజుల తర్వాత తిరిగి అదే రైల్వేస్టేషన్‌కు చేరుకోనుంది. ఈ ప్రత్యేక భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మహాకుంభ్ పుణ్యక్షేత్ర యాత్ర పేరిట నామకరణం చేశారు. ఈ మేరకు గురువారం రాత్రి సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుస్తు న్న ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఉత్త ర్‌ప్రదేశ్‌లోని వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లనుంది. దీనికి సంబం ధించి ప్రయాణ ప్యాకేజీని ఇదివరకే రైల్వే అధికారులు ప్రకటించారు. ఇండియన్ రైల్వేస్ క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొ రేషన్(ఐఆర్‌సీటీసీ) నుంచి మంచి ఆదరణ లభించినట్లు అధికారులు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 576 సీట్లు బుక్ చేసు కునే అవకాశం కల్పించారు. దేశంలో ప్రఖ్యాత పుణ్య క్షేత్రాలను అనుసంధానిస్తూ రైల్వే మం త్రిత్వ శాఖ భారత్‌గౌరవ్ పేరిట ఈ తరహా ప్ర త్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటికి ప్రయా ణికుల నుంచి అద్భుత స్పందన లభిస్తోంది. ఐఆర్‌సీటీసీ సికింద్రాబాద్‌నుంచి అయోధ్య, వారణాసికి ఈ ఎక్స్‌ప్రెస్ రైలును అందుబాటులోకి తీసుకువచ్చింది. 7 రాత్రిళ్లు, 8 పగళ్లు ఈ రైలు ప్రయాణం సా గనుంది. ఈ తరహాలోనే పూణే, తిరునేల్‌వేళి, ఇండోర్, పూరీ, పుదుచ్చేరి, రాజ్‌కోట్, కోయంబ త్తూర్, కోల్‌కత్తా, ఉదయ్‌పూర్, జయసల్‌మేర్‌లనుంచి మహాకుంభ్‌మేళా పుణ్యక్షేత్ర యాత్ర పేరిట ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్‌లో వచ్చేనెల 19న మొదలయ్యే ఈ రైలు తెలంగాణలోని భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిరతోపాటు ఏపీలోని విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్లలో హాల్ట్ సదుపాయం ఉంది. ప్యాకేజీలో వారణాసిలోని కాశీ విశ్వనాథ ఆలయం, కాశీ విశాలాక్షిదేవి ఆలయాన్ని సందర్శించవచ్చు. అయోధ్యలో శ్రీరామచంద్రుల వారి ఆలయం, హనుమాన్ గర్హి, హారతి, అత్యంత ప్రాచీనమైన సరయూ నదిని దర్శించవచ్చు. ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణీ సంగమం సందర్శనతో ఈ ప్యాకేజీ ముగుస్తుంది. ప్రయాగ్‌రాజ్ నుంచి మళ్లీ ఆయా హాల్ట్‌లతో పాటు చివరిగా సికింద్రాబాద్ చేరుకుంటుంది.



ఈ రైలు టిక్కెట్ ధరలిలా..

స్లీపర్.. పెద్దవారికి	- రూ.22,635
పిల్లల(5-11ఏళ్లు)కు	- రూ.21,740
థర్డ్ ఏసీ.. పెద్దలకు	- రూ.31,145
పిల్లలకు	- రూ.30,095
సెకండ్ ఏసీ.. పెద్దలకు	- రూ.38,195
పిల్లలకు	- రూ.36,935

ఈ రైలు వచ్చే ఏడాది.. అనగా 2025, జనవరి 19న సికింద్రాబాద్‌నుంచి బయలుదేరనుంది. దీనికి 576 సీట్లు రిజర్వేషన్‌కు బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ప్రస్తుతం సెకండ్ ఏసీలో టిక్కెట్ల బుకింగ్ క్లోజ్ అయింది. థర్డ్‌ఏసీ, స్లీపర్‌లో బుకింగ్‌కి అవకాశం ఉంది. మన తెలుగు రాష్ట్రాల్లో 17 హాల్ట్‌లు ఇవ్వగా వాటిలో మన జిల్లాలో రాజమహేంద్రవరం, సామర్లకోట, తుని నుంచి బుక్ చేసుకునే అవకాశం ఉంది.

ఉత్కంఠభరితంగా..

బాక్సింగ్ పోటీలు



పిఠాపురంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పోటీపడుతున్న బాక్సర్లు

- పిఠాపురంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం
- తరలివచ్చిన 150మంది బాక్సర్లు

పిఠాపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 8వ రాష్ట్రస్థాయి పురుషుల బాక్సింగ్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 150మంది బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాక్సర్ల మధ్య పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీలను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి టీపీ లక్ష్మణదేవ్, కోశాధికారి శ్రీనివాసరావు, టెక్నికల్ కమిటీ చైర్మన్ డి.నాగేశ్వరరావులు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీలను ప్రేక్షకులు తిలకించేందుకు తరలివచ్చారు. కార్యక్రమాల్లో ఆర్గనైజింగ్ కార్యదర్శి పి. లక్ష్మణరావు పర్యవేక్షించగా, మునిసిపల్ కోఆప్షన్ సభ్యు డు గండేపల్లి బాబీ, కొత్తప ల్లి బుజ్జి, ప్రభుత్వ జూనియ ర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్ వియ్యపు రామన్నరాజు, అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కోశాధికారి నవీన్ పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరింది వీరే..

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో రౌండ్ల వారీగా పోటీల అనంతరం సెమీఫైనల్‌కు 47.5 కిలోలవిభాగంలో పి.పవన్(విశాఖజిల్లా), ఎస్.రాంబాబు(కాకినాడ), వై.ప్రభుదాస్(తిరుపతి), ఎం.జయంత్ సాయిస్వరూప్(మన్యం), 50-55 కిలోల విభాగంలో బాలగణేష్‌రెడ్డి(కడప), పి.ప్రసాద్(అనంతపురం), సూర్యదేవేందర్(నంద్యాల), జ్ఞానేశ్వర్(శ్రీకాకుళం), 55-60 కిలోల విభాగంలో డి.సందీప్(విశాఖ), ఎస్కే బాజీబాబా(ఎన్టీఆర్‌జిల్లా), పి.దిగ్విజయ్(కడప), పి.అప్పలరాజు(శ్రీకాకుళం), 60-65కిలోల విభాగంలో పి.విశేశ్వరరావు(శ్రీకాకుళం), జయసాయితరుణ్(నెల్లూరు), ఎన్.సతీష్(పశ్చిమగోదావరి), భానుప్రకాష్(విశాఖ) చేరుకున్నారు. మిగిలిన విభాగాల్లో పోటీలు కొనసాగుతున్నాయి.



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జనసేన పిఠాపురం ఇన్‌చార్జి శ్రీనివాసరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు

అన్నవరంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.వి.తమిళసెల్వీ స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ అధికారులు పెన్నాడ వెంకటేశ్వరరావు, గణపతిలు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



వేదాశీర్వచనం పొందుతున్న తమిళసెల్వీ

ఎన్నెన్నో అందాలు!

- మోతుగూడెంలో ఆకట్టుకుంటున్న ప్రకృతి రమణీయ దృశ్యాలు



చింతూరు మండలం మోతుగూడెంలో పొల్లూరు జలపాతం





చింతూరు మండలం పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం



మోతుగూడెం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలో ఎన్నెన్నో అందాలు.. అన్నింటా కట్టి పడేసే చూడచక్కని ప్రదేశాలు.. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీప్రాంతమైన చింతూరు మండలం మోతుగూడెం, డొంకరాయిల్లో ప్రకృతి రమణీయ దృశ్యాలు పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. ఈ అందాలను స్వయంగా చూస్తేనే మనం మంచి అనుభూతి పొందగలం. చింతూరు మండలం మోతుగూడెం, వై.రామవరం మండలం డొంకరాయి పచ్చని కొండలు.. వాటినుంచి జాలువారే జలపాతాలు.. అదే ప్రాంతాల్లోని జలవిద్యుత్ కేంద్రాలు, వాటి రిజర్వాయర్లు, ప్రాజెక్టు ప్రదేశాల్లోని జలప్రదేశాలు పర్యాటకులకు ఎంతో ఉల్లాసాన్ని కలిగిస్తాయి. అక్కడ గిరిజన గ్రామాలు పచ్చని పంట చేల మధ్య ఎంతో ఆహ్లాదకరంగా ఉంటాయి. ప్రస్తుతం శీతాకాలం కావడంతో వీటిని సందర్శించడానికి మంచి సీజన్. నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో ఇక్కడి అందాలను చూసేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఇక్కడ అందాలపై ఎన్నో సినిమాలు కూడా తీశారు. ఇటీవల సంచలనం సృష్టించిన పుష్ప-1, పుష్ప-2 చిత్రాలు ఇక్కడే చిత్రీకరించారు. వారాంతాల్లో ఇక్కడ పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. కానీ జలపాతాల వద్ద మాత్రం జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.



సీలేరు నదిలో పుష్ప చిత్రం షూటింగ్ జరిగిన ప్రదేశం



ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో పులి పాదముద్రలు(ఫైల్)

పెద్దపులి ఎక్కడ?

- ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ఏజెన్సీలో వీడని భయాందోళన

ప్రత్తిపాడు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతంలో పెద్దపులి సంచారం స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో ఇటీవల సంచరించిన పెద్దపులి ఏమైందనేది ప్రశ్నార్థకంగా మారింది. 15రోజులక్రితం బురదకోట అటవీప్రాంతంలోని బాపన్నదార వద్ద లేగదూడను పెద్దపులి చంపి కొద్దిపాటి మాంసాన్ని తినడం ఆ ప్రాంతంలో సంచరించడం, పులి పాద ముద్రలను అటవీశాఖాధికారులు గుర్తించడం వంటివి తెలిసిందే. పెద్దపులి ప్రస్తుతం ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. పులిజాడ ఆచూకీ ఒకవైపు తెలియకపోవడం, మరోవైపు మళ్లీ సబ్‌ప్లాన్ ఏజెన్సీ అటవీప్రాంతంలోకి వస్తుందేమోనని స్థానికుల్లో భయాందోళన వీడలేదు. పెద్దపులి మళ్లీ రావచ్చనే అభిప్రాయంతో అటవీశాఖాధికారులు బురదకోట అటవీప్రాంతంలో ఆరు ట్రాప్ కెమెరాలు పెట్టారు. రెండు వారాలు గడుస్తున్నా అవి ఇంకా ఉంచారు. దీంతో పులి మళ్లీ బురద కోట అటవీప్రాంతంతోపాటు సబ్‌ప్లాన్ ఏజెన్సీ అటవీప్రాంతంలో సంచరించవచ్చనే భయాందోళనలో సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులను వెంటాడుతున్నాయి.

అడ్డతీగల అటవీప్రాంతం వైపే..

బురదకోట అటవీప్రాంత సమీపంలో ఉన్న రాజవొమ్మంగి అటవీప్రాంతంలో ఆరు రోజుల కిందట పెద్దపులి సంచరించడాన్ని చూసిన ఓ వ్యక్తి స్పృహ కోల్పోయి ఆస్పత్రిలో చేరారు. దీంతో పులి ఆ అటవీప్రాంతంలో ఉందనడానికి బలం చేకూరింది. ప్రస్తుతం పెద్దపులి రాజవొమ్మంగి అటవీప్రాంతం గుండా అడ్డతీగల అటవీ ఫారెస్ట్‌లోకి వెళ్లినట్లు అటవీశాఖాధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్తిపాడు సబ్‌ప్లాన్ ఏజెన్సీ, రాజవొమ్మంగి అడ్డతీగల అటవీ ప్రాంతం కలిసి ఉండడంవల్ల ఈ ఫారెస్ట్‌లోనే పులి తిష్ట వేసినట్లుగా పలువురు భావిస్తున్నారు. పెద్దపులి సంచారంపై ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ దుర్గారాం ప్రసాద్‌ను వివరణ కోరగా అడ్డతీగల అటవీప్రాంతం వైపు వెళ్లినట్లు సమాచారం ఉందని, బురదకోట అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలు ఇంకా తొలగించలేదని స్పష్టం చేశారు.

బలిఘట్టం సత్యదేవుడి ఆలయం పరిశీలన

- స్థానిక అధికారులతో కలిసి పర్యటించిన అన్నవరం ఈవో

అన్నవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా బలిఘట్టం సత్యదేవుడి ఆలయాన్ని అన్నవరం ఈవో ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు అక్కడి దేవస్థానం అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతులమీదుగా ఈనెల 6న అన్నవరం దేవస్థానం ఈ ఆలయాన్ని దత్తత తీసుకుంది. ఈ నేపథ్యంలో అక్కడి ఆలయంతోపాటు ఆలయ ఆధీనంలో ఉన్న భూముల రికార్డులు, ఇతర వివరాలను అన్నవరం ఈవో సుబ్బారావు తెలుసుకున్నారు. అక్కడ ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఉపకమిషనర్ చంద్రశేఖర్, పీఆర్వో కొండలరావు, సూపరింటెండెంట్ రమణ పాల్గొన్నారు.

టమోటా.. కిలో రూ.5



- నేల చూపులు చూస్తున్న టమోటా
- అయోమయంలో రైతులు

గండేపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): టమోటా ధర పెరుగుతూ తగ్గుతూ రైతులను నష్టాల్లోకి నెట్టేస్తోంది. ఒకానొక సమయంలో కిలో రూ.200 పలికిన కిలో టమోటా ధర ఇప్పుడు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ మధ్యకాలంలో కిలో రూ.20 ఉన్న ధర ఒక్కసారిగా రూ.5కు పడిపోవడంతో వారంతా అయోమయంలో పడ్డారు. కోత కూలీ కూడా రాక ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో నష్టాలు ఎదుర్కొంటున్నారు. మదనపల్లి నుంచి లోకల్ మార్కెట్‌లకు సరుకు భారీగా దిగుమతులు కావడంతో ఇక్కడ పండించిన టమోటా ధర పడిపోతోందని వ్యాపారులు అంటున్నారు. రిటైల్ వ్యాపారస్తులు హోల్‌సేల్ మార్కెట్‌లో తక్కువకు కొని వినియోగదారులకు రూ.5నుంచి రూ.10 మధ్య విక్రయాలు చేస్తున్నారు.

ట్యాంకర్ నుంచి యాసిడ్ లీకేజీ

- పోలీసులు అప్రమత్తం.. తప్పిన ప్రమాదం
- అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



రాజానగరం సమీపంలో హైవేపై పడిన యాసిడ్‌ను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజానగరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్‌వద్ద గురువారం తెల్లవారుజామున ప్రయాణిస్తున్న ట్యాంకర్‌నుంచి యాసిడ్ (హెచ్‌సీఎల్) లీక్ అవడంతో ప్రయాణికులు ఆందోళనకు లోనయ్యారు. విశాఖ నుంచి యాసిడ్ ట్యాంకర్ దేవరపల్లి బయలుదేరింది. మార్గమధ్యలో జీఎస్ఎల్ సమీపానికి వచ్చేసరికి ట్యాంకర్ నుంచి యాసిడ్(హెచ్‌సీఎల్) లీకై హైవేపై పడి పొగలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు ట్యాంకర్ డ్రైవర్‌ను సూచించడంతో డ్రైవర్ తక్షణమే ట్యాంకర్‌ను నిలిపివేశారు. విషయం తెలుసుకున్న రాజానగరం పోలీసులు, హైవే పెట్రోలింగ్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజమహేంద్రవరం, కోరుకొండనుంచి అగ్నిమాపకయంత్ర సిబ్బంది సకాలంలో సంఘటనాస్థలానికి చేరుకుని యంత్రాల సహాయంతో పొగలు వ్యాప్తిచెందకుండా ఉండేలా ట్యాంకర్‌నుంచి యాసిడ్ లీకేజీ కాకుండా అరికట్టారు. లీకేజీ అదుపు చేయకుంటే హెచ్‌సీఎల్ గాలిలో వ్యాపించి స్థానికులకు కళ్లు మండడంతోపాటు శరీరంపై దురదలు, దద్దుర్లు వస్తాయని అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు వివరించారు. హైవేపై వాహనాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా తగు చర్యలు చేపట్టారు. ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వేట్లపాలెం హత్య కేసులో నిందితులకు రిమాండ్

కాకినాడ క్రైం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం వేట్లపాలెం హత్యాకాండ జిల్లా ప్రజల వెన్నుల్లో వణుకు పుట్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి గురువారం కాకినాడ నాలుగో అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నిరుపమ భంజ్ డియో 14 రోజుల రిమాండ్ విధించారు. సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఒక ఇంటి నిర్మాణం విషయంలో తలెత్తిన వివాదంలో ఇరువర్గాల పరస్పర దాడిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని మరో వర్గం అత్యంత పాశవికంగా హత్య చేసి మరో ఏడుగురిపై హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. నిందితులైన బచ్చల మోషే, బచ్చల జకర్యా, బచ్చల బిల్లప్ప, బచ్చల దొరయ్య, బచ్చల రాము, బచ్చల గోపి, బచ్చల గవరయ్య, బచ్చల రాజు, బచ్చల సూర్యకాంతం, బచ్చల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి, కొత్తపల్లి చిన్నయ్యలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

గోపాలపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితంలేని వ్యక్తి గోపాలపురం శివారులో ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయంవద్ద మృతిచెందినట్లు ఎస్ఐ కే.సతీష్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బోడిగూడెం గ్రామానికి చెందిన జక్కు గంగరాజు(50) మతిస్థిమితం లేక కొద్దిరోజులుగా ఇంటినుంచి బయటకు వెళ్లాడన్నారు. గురువారం మధ్యాహ్నం గోపాలపురం శివారులో కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం ఎదుట అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించామన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

సర్పవరంజంక్షన్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం పండూరులో చోటు చేసుకుంది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేటకు చెందిన ముద్ద సత్యనారాయణ(58) తాపీపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం తాపీపని కోసం ఇంటినుంచి బయలుదేరి వెళ్లాడు. పని ముగించుకుని గోర్స నుంచి పండూరుకి సైకిల్‌పై వెళ్తున్నాడు. పండూరులో శ్రీడిజిటల్ స్టూడియో సమీపంలోని పాలకేంద్రం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఏఈ యుజె8653 సత్యనారాయణను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముక్కు, చెవి, నోటి నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. మృతుడు కుమారుడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టెన్త్ ఆన్‌లైన్ దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అవకాశం

కాకినాడ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చేమార్చిలో నిర్వహించే టెన్త్ పరీక్షలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల్లో తప్పుల సవరణకు పాఠశాల లాగిన్‌లో ఎడిట్ ఆప్షన్ ఎంపిక ప్రారంభిస్తామని డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల రికార్డుల్లోను, విద్యార్థి అపార్ ఐడీలో నమోదు చేసిన అన్ని దరఖాస్తులను మరోసారి తనిఖీ చేయాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల్లో ఇంతకుముందు తప్పులు చేసిన ప్రధానోపాధ్యాయులు ఈనెల 23 వరకూ పాఠశాల లాగిన్‌లో ప్రారంభించే వెబ్ అప్లికేషన్‌లోని విద్యార్థులకు అవసరమైన ఫీల్డ్‌లో సవరణలుంటే సరిచేసేందుకు ఎడిట్ ఎంపిక అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. లోపాలు లేని డేటాను హాల్ టికెట్‌లకు అప్‌డేట్ చేయాలని డీఈవో సూచించారు.

నేడు కౌన్సెలింగ్ పద్ధతిలో పదోన్నతుల ప్రక్రియ

కాకినాడ రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలోని గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల ప్రక్రియను శుక్రవారం కౌన్సెలింగ్ పద్ధతిలో కాకినాడ డీఈవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి వెబ్‌సైట్‌లో పొందుపరచిన సీనియారిటీ లిస్టులో తెలిపిన ఉపాధ్యాయులంతా ఒరిజినల్ సర్టిఫికెట్లు, సర్వీసు పుస్తకంతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. ముందుగా ధ్రువపత్రాల పరిశీలన తర్వాత పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు

కాకినాడసిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 22 వరకు మూడురోజులు కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలోని మల్టీ ఆడిటోరియంలో అంతర్ జిల్లాల, రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాకినాడ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ విజయ ప్రకాష్, కె.మోహన్‌బాబు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 16 జిల్లాల నుంచి వివిధ విభాగాల్లో 575 ఎంట్రీలు నమోదయ్యాయన్నారు. ఈ పోటీలు ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ వి.భాస్కరరామ్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కేవీఎస్ ప్రకాషరావు, పి.విశ్వనాథ్, కాకినాడ చైర్మన్ రావు చిన్నారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు చీఫ్ రిఫరీగా రమణారావు, అసిస్టెంట్ చీఫ్ రిఫరీగా పి.వేణు వ్యవహరిస్తారన్నారు.అతిథులుగా ఓఎన్జీసీ ఈడీ కె.రత్నేష్‌కుమార్, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగమణి, కాకినాడ ఏపీఎస్పీ మూడోబెటాలియన్ అధికారిణి ఎం.దీపికా పాటిల్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ సహా పలువురు విచ్చే యనున్నారని తెలిపారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

నిడదవోలు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): నిడదవోలు రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో గురువారం రైల్వేట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని నిడదవోలు మండలం తిమ్మరాజుపాలేనికి చెందిన రాకుర్తి నాగ్రేందరావు(54) మృతిచెందాడు. మృతుడు రాజమండ్రిలో ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు.

ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై.. 311 వినతులు





కాకినాడ కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతులు అందజేస్తున్న మాదిగ, మాల సంఘాల ప్రతినిధులు

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 2468 మంది హాజరు
- కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాలవారీగా సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై కచ్చితమైన గణాంకాలతో సమగ్ర వివరాలను అందించాలని ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులను కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా ఆయన కాకినాడ జిల్లా కలెక్టరేట్ హాలులో ఉమ్మడి జిల్లాలో భాగమైన నాలుగు జిల్లాలకు సంబంధించిన ఎస్సీ ఉపకులాలవారీగా జనాభా, వారి స్థితిగతులపై అధికారులతో గురువారం సమీక్షించారు. ఎస్సీ ఉపకులాల ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి హాజరైన 2468 మంది నుంచి వర్గీకరణపై 311వినతులు స్వీకరించారు.

సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు సంబంధించిన 2011 జనాభా గణన ఆధారంగా ఎస్సీ ప్రజల గణాంకాలను ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వివరించారు. 2011 జనాభా గణాంకాల ప్రకారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం జనాభా 52,85,824మంది ఉండగా ఇందులో 9,57,302మంది(18.11 శాతం) ఎస్సీ జనాభా ఉన్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో అక్షరాస్యత 70.50శాతం ఉండగా, ఎస్సీ కులాల జనాభాలో అక్షరాస్యత 69.37 శాతంగా ఉందన్నారు. పురుషుల్లో 72.96శాతంగా, మహిళల్లో 65.79శాతం అక్షరాస్యులుగా ఉన్నారన్నారు. వీరిలో ప్రధానంగా 68.507 శాతం మాల, మాల అయ్యావారు వర్గం, 22.132శాతం మాదిగ వర్గం, 4.873శాతం ఆది ఆంధ్ర వర్గం, 1.556 శాతం రెల్లి వర్గం ప్రజలు ఉండగా మిగిలిన ఉపకులాల్లో ఒకటి కంటే తక్కువ శాతం ఉన్నారని వివరించారు. అనంతరం ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల సామాజిక ఆర్థిక, రాజకీయ స్థితిగులపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. షెడ్యూల్డ్ కులాల ఉపవర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ కాకినాడ జిల్లాలో గురువారం పర్యటించింది. ఈ పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు సంబంధించిన అంశాలపై ఆయా షెడ్యూల్డ్ కులాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగ సంఘాలు నుంచి వచ్చిన మొత్తం 311 వినతులను ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా స్వీకరించారు. ప్రజాభిప్రాయ సేకరణలో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ భావన ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలు ఎస్సీ ఉపకుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, కులాల పునర్విభజనపై తదుపరి చర్యల నిమిత్తం కమిషన్ ప్రభుత్వానికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

బైక్‌పై లిఫ్ట్ అడిగి వెళ్తుండగా.. అదుపుతప్పి పడిపోయి..



సంఘటనాస్థలంలోనే మృతిచెందిన శ్రీను

- సంఘటనాస్థలంలోనే వ్యక్తి మృతి
- మరో యువకుడికి తీవ్రగాయాలు

దివాన్‌చెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బైక్‌పై లిఫ్ట్ అడిగి వెళ్తూ వాహనం అదుపుతప్పి పడిపోయి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడు గాయపడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు దగ్గర్లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బొమ్మూరు ఎస్ఐ ఎస్‌పీ కుమార్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన చుక్కా శ్రీను(38) తన అత్తవారి గ్రామమైన రాజానగరం మండలం శ్రీరాంపురంలో నివాసం ఉంటున్నాడు. అతడు కూలీ పని చేసుకుని జీవిస్తుంటాడు. కాగా, గురువారం సాయంత్రం అతడు శ్రీరాంపురం అత్తవారింటికి వెళ్లేందుకు దివాన్‌చెరువు సెంటర్‌లో ఓ విద్యార్థి బైక్‌పై లిఫ్ట్ అడిగి ఎక్కాడు. వారు దివాన్‌చెరువునుంచి శ్రీరాంపురం రోడ్డులోని శ్రీచైతన్య టెక్నోస్కూల్ వద్దకు వచ్చేసరికి మోటారుసైకిల్ అదుపు తప్పి ఇద్దరూ పడిపోయారు. ఈ ప్రమాదంలో చుక్కా శ్రీను తలకు, శరీరంపైన తీవ్రరక్తపు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య, పిల్లలు శ్రీరాంపురంలోనే నివాసం ఉంటున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కుమార్ తెలిపారు. కాగా ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న రాజానగరం మండలం ముక్కినాడకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి అనదాసు వెంకటరమణ దివాన్‌చెరువు సమీపంలోని ఒక కళాశాలలో ఇంజనీరింగ్ విద్య మొదటి సంవత్సరం అభ్యసిస్తున్నాడు. అతడికి చేతికి, తలకు తీవ్రగాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మార్కులు తక్కువగా వస్తున్నాయని, బాగా చదవాలని తల్లి మందలించినందుకు బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చింతపల్లి నైపుణ్య(16) పదో తరగతి చదువుతోంది. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో నైపుణ్యకు మార్కులు తక్కువగా వస్తున్నాయని ఉపాధ్యాయిని బాలిక తల్లి సుభాషిణికి సమాచారం ఇచ్చారు. దీంతో బాగా చదువుకోవాలని తల్లి గట్టిగా మందలించింది. దీన్ని తట్టుకోలేని ఆ బాలిక గురువారం కూరగాయలకు కొట్టే పురుగుమందును తాగింది. ఇది గమనించిన తల్లిదండ్రులు అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతోందని కుటుంబీకులు తెలియజేశారు.

పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డికి చుక్కెదురు

- తమను పట్టించుకోవడంలేదని మత్స్యకార గ్రామాల్లో ప్రతిఘటన
- సమస్యలు తెలియజేస్తే డిప్యూటీ సీఎం పవన్‌కు విన్నవిస్తానని హామీ

కొత్తపల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్‌కు మత్స్యకార గ్రామాల్లో గురువారం తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. కోనపాపపేటలో సముద్రకోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలించేందుకు ఆయన వచ్చినపుడు అనూహ్యంగా ప్రజలనుంచి ప్రతిఘటన ఎదురైంది. పవన్ కళ్యాణ్ తరపున ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ గ్రామాల్లో ఒకరిద్దరి మాటలకే విలువిస్తూ మిగిలిన వారిని అలక్ష్యం చేస్తున్నారంటూ వీరంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనపాపపేట సెంటర్లో ఎదురైన ఈ ప్రతిఘటనకు మర్రెడ్డి మనస్తాపం చెందారు. నాయకులంతా ఐకమత్యంగా ఉండి తనను కలిస్తే సమస్యలను నమోదు చేసుకొని డిప్యూటీ సీఎంకు నివేదిస్తానన్నారు. తాను అందరినీ సమదృష్టితో చూసుకుంటానన్నారు. అనంతరం కార్యకర్తలతో కలిసి సముద్ర కోతను పరిశీలించారు.



కోనపాపపేటలో మర్రెడ్డిని నిలదీస్తున్న మత్స్యకారులు

గొల్లప్రోలులో మద్యం షాపు వద్ద ఘర్షణ

- ఇద్దరికి కత్తిపోట్లు

గొల్లప్రోలు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని మద్యం షాపు వద్ద గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు కత్తిపోట్లకు గురయ్యారు. బస్టాండు సమీపంలోని మద్యంషాపు వద్ద సైకిల్ పడిపోయిన విషయంలో జరిగిన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఒక మైనర్ బీరు బాటిల్, కత్తితో దాడికి దిగినట్లు చెబుతున్నారు. ఈ ఘర్షణలో జి.నాగేశ్వరరావు, ఎ.వీరబాబు కత్తిపోట్లకు గురయ్యారు. వీరిని తొలుత పిఠాపురం తర్వాత కాకినాడ జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. మైనర్‌కు మరో ఇద్దరు సహకరించినట్లు సమాచారం. మద్యం షాపు వద్ద జరిగిన ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది.



కత్తిపోట్లకు గురై గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి

రెండు జాతీయ రహదారులు

- జీలుగుమిల్లి టూ పట్టిసీమ
- పట్టిసీమ టూ కొవ్వూరు
- సీఎం ఆదేశంతో కదలిక

రాజమహేంద్రవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు, పట్టిసీమ పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి అనుకూలంగా జీలు గుమిల్లి నుంచి పట్టిసీమ వరకూ అక్కడినుంచి ఏటిగట్టు వెంబడి జాతీయ రహదారి నిర్మించనున్నారు. ఈ ప్రతిపాదన ఏడేళ్ల కిందటే ఉన్నప్పటికీ, ఇటీవల పోలవరం వచ్చిన సీఎం చంద్రబాబు ఆదేశంతో మళ్లీ కదిలింది. జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, కన్నాపురం, కెఆర్‌పురం, దొండపూడి మీదగా పట్టిసీమ వరకూ ఈ జాతీయ రహదారిని నిర్మించనున్నారు. జీలుగుమిల్లి నుంచి కొంతమేర ఇప్పటికే టెండర్లు పిలిచారు. ఇక పట్టిసీమ నుంచి ఏటిగట్టును విస్తరించుకుంటూ కొవ్వూరు టౌన్ వరకూ కూడా జాతీయ రహదారిని నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం అధికారులతో సమీక్షించారు. ఇటీవల పోలవరం వచ్చిన సీఎం ఉన్నతస్థాయి అధికారుల సమావేశంలో పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానంగా హైవే నిర్మాణంపై కూడా దిశా నిర్దేశం చేశారన్నారు. జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ గ్రామానికి అనుసంధానం చేస్తున్న హైవేకు సంబంధించిన భూసేకరణపై సమగ్ర వివరాలతో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈ నెల 23, 26వ తేదీల్లో ఎన్‌హెచ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయనున్నట్లు కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు.

చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

- ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి



క్రికెట్ ఆడి జట్టు ఎంపికలు ప్రారంభిస్తున్న వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా తగిన ప్రాధాన్యమివ్వాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు గురువారం జరగ్గా వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకుంటూ ఆటలు ఆడాలన్నారు. ఎంపికల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో క్రీడాభివృద్ధికి విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు అన్నీ కృషిచేయాలని సూచించారు. కార్యనిర్వాహక కార్యదర్శి వీవీఎంయూ ఫణీంద్ర మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని 40 నుంచి 50 కళాశాలల నుంచి 80 నుంచి 90 మంది క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరయ్యారన్నారు. ఇక్కడ బాగా ప్రతిభ కనబరచిన 16మందితోపాటు మరో ఆరుగురు క్రీడాకారులను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేస్తామన్నారు. వచ్చేనెలలో తమిళనాడులో యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్‌లో జరిగే టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విద్యకళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ లింగారెడ్డి, విద్య కళాశాల అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, మూర్తి, రామ్‌గోపాల్ సత్యనారాయణ, సాల్మన్‌దేవానంద్ పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాధితురాలి రోధన

గోపాలపురం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ వేడినీళ్లు పడి శరీరం కాలిపోయి రోధిస్తూ ఆస్పత్రికి వచ్చిన రోగికి సరైన వైద్యం అందించడంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని రోగి బంధువులు గురువారం విలేఖర్లకు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన ఎలిపే ఇంధిరమ్మ బుధవారం రాత్రి ఇంట్లో వంట వండే సమయంలో వేడి నీళ్లు మీదపడ్డాయని వారు తెలిపారు. దీంతో శరీర ఉదర భాగమంతా కాలిపోవడంతో హుటాహుటినా ఆమెను గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి అర్ధరాత్రి సమయంలో తీసుకొచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తెల్లవార్లు ఆమె కాలిన గాయాలతో రోధిస్తూనే ఉందన్నారు. ఆస్పత్రి సిబ్బంది కొంత మేర వైద్యంఅందించినా బాధితురాలికి పూర్తిస్థాయిలో వైద్యసేవలందించలేదన్నారు. గురువారం ఉదయం ఆస్పత్రికి వచ్చిన మిగిలిన వైద్యులు ఆమెను పరిశీలించి శరీరంలో ఉదరభాగం 20శాతం కాలిపోయిందని రిజిస్టర్ పరిశీలించగా కనీసం ఆ బాధితురాలి పేరు నమోదు కాకపోవడంతో నివ్వెరపోయినట్లు తెలిపారు. మెరుగైన వైద్య కోసం రాజమహేంద్రవరం తీసుకెళ్లాలని బాధితురాలి బంధువులకు వైద్యులు సూచించారు. దీంతో ఆగ్రహించిన వారు వైద్యురాలిని నిలదీయగా హడావుడిగా వైద్యంఅందించి మధ్యాహ్నం రాజమహేంద్రవరం తరలించారు. దీనిపై ఆస్పత్రి సూపరిండెంటెండ్ వైద్యులు చైతన్యరాజును వివరణ కోరగా డ్యూటీ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యురాలికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఉత్తమ ఫలితాల సాధనకు మెటీరియల్ ఉపయోగం

ఉండ్రాజవరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధనకు స్టడీ మెటీరియల్ ఉపయోగమని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఐ.రాంబాబు పేర్కొన్నారు. ఉండ్రాజవరం హైస్కూలు టెన్త్ విద్యార్థులు 160మందికి రాంబాబు ఆర్థిక సహాయంతో స్టడీ మెటీరియల్ గురువారం అందజేసారు. ఈసందర్భంగా రాంబాబును హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు మాణిక్యాలరావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

మోటారు బైక్ చోరీ

బిక్కవోలు, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మోటార్ బైక్ చోరీకి గురైందని బిక్కవోలు గ్రామ పరిధి కొత్తపేటలో నివాసం ఉంటున్న గుబ్బల శ్రీబాలాజీ గురువారం ఫిర్యాదు చేశాడని ఎస్ఐ వి.రవిచంద్ర కుమార్ తెలిపారు. బాలాజీ మంగళవారం రాత్రి ఇంటి ముందు బైక్ పార్క్ చేసి, బుధవారం ఉదయం చూసేసరికి బైక్ కనిపించక పోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు బైక్ చోరీ చేసారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు.

నగరంలో గుంతలు పూడ్చివేత

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


లింగంపేటలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గుంతలను వచ్చే పండుగలోపు పూడ్చివేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 39వ డివిజన్ లింగంపేటలో రూ.62 లక్షలతో చేపడు తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు గురు వారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో సుమారు రూ.10 కోట్ల పనులు పూర్తి చేశామన్నారు. నగరంలో ప్రస్తుతం రూ.22.51 కోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, మాజీ కార్పొరేటర్లు కడలి రామకృష్ణ, కొయ్యల రమణ, తంగెళ్ళ బాబి, గొర్రెల రమణి, మొకమాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియం నెలాఖరులోగా చెల్లించాలి


బీమా ప్రీమియం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, వ్యవసాయాధికారులు

రాజమహేంద్రవరం రూరల్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వరి, మొక్కజొన్న పంటలకు బీమా సౌకర్యానికి సంబంధించిన కరపత్రాలను గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ తుపానులు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థికసాయం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. వరి పంటకు ఎకరాకు ప్రీమియం రూ.630 రైతు చెల్లించాలన్నారు. దీనివల్ల రూ.42వేలకు బీమా అవుతుందన్నారు. మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ.540 రైతు చెల్లిస్తే రూ.36వేలకు బీమా అవుతుందన్నారు. బీమా ప్రీమియం 31లోగా చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు.

నీలాగే అందరూ ఉంటారనుకోకు..

మాజీ ఎంపీ భరత్‌రామ్‌పై టీడీపీ నేతల మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న బుడ్డిగ రాధా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజా నాయకుడు ఎవరో, భక్షకుడెవరో నగరవాసులకు తెలుసునని అందుకే నిన్ను ఎన్నికలో ఓడించారని మాజీ ఎంపీ భరత్ రామ్‌పై టీడీపీ నేతలు ఫైర్ అయ్యారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధ, టీడీపీ పార్లమెంట్ కమిటీ అధికార ప్రతినిధి దాస్యం ప్రసాద్, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ బుడ్డిగ రవి మాట్లాడారు. రాజమహేంద్రవరం సమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముందుకెళుతుంటే చూసి తట్టుకోలేక నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నావన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు ప్రతి పనికి 25 శాతం కమీషన్ తీసుకున్నావన్నారు. నీ వల్లే అందరు ఉంటారని అనుకోవద్దన్నారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా, తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండిప్రియ, నాయకులు కోకోనట్ వాసు, లోకేష్, కాశి, రమణి, వెంకట్రాజు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ కె.తిలక్ కుమార్ తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజమహేంద్రవరం రూరల్ ఆధ్వర్యంలో డివిజన్‌లో పరిధిలో సీతానగరం, కోరుకొండ పాఠశాలల్లో బుర్రకథ కార్యక్రమాలు నిర్వహించారు. నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరం హైస్కూల్‌లో పిల్లలకు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం టౌన్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోండి

డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లకు బోధన పద్ధతులపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో కె.వాసుదేవరావు అన్నారు. నన్నయ ఉన్నత పాఠశాలలో గురువారం ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 21 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో వివిధ పాఠశాలల నుంచి 125 మంది డీఆర్‌పీలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీడీపీవో డి.మమ్మి, ఏసీడీపీవోలు కనకవల్లి, వరలక్ష్మి, డైట్ లెక్చరర్ డీఎస్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాం

ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు వినతి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19(అంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ మిశ్రాను తూర్పుగోదావరి జిల్లా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నక్కా వెంకటరత్నరాజు, కార్యదర్శి నక్కా చంటిబాబు, పలువురు దళిత సంఘాల నాయకులు, న్యాయవాదులు కలిసి వినతి పత్రాలు అందించారు. రాజ్యాంగంలోని 341 ఆర్టికల్ ప్రకారం ఎస్సీలను వర్గీకరించే అధికారం లేదని.. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు.


సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వారి జీవితాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి వెలుగులు నింపుతుందని రూరల్ ఎంఎల్ఏ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలకు అన్ని విధాలా మేలు చేసేలా పని చేస్తున్నదన్నారు. హుకుంపేట గ్రామానికి చెందిన ప్రగళ్ళపాటి కల్పనకు రూ.7లక్షలు, మంతెన శ్రీరామమూర్తికి రూ.2 లక్షల 22వేల 731, కాతేరుకు చెందిన జొన్నాడ వీరవెంకట సూర్యసాయికి రూ.లక్ష, వలెపు ఈశ్వర్‌కు రూ.61,572, దుళ్ళ గ్రామానికి చెందిన వట్టి తలుపులమ్మకు రూ.40వేలు ముఖ్యమంత్రి సహాయనిధిని చెక్కులను తన నివాసంలో అందించారు. కార్యక్రమంలో మత్యేటి శివసత్య ప్రసాద్, నున్న కృష్ణ, బొప్పన నానాజీ, గుర్రపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్పాదక సంస్థలతో వివిధ దేశాలకు ఎగుమతులు

రాజమహేంద్రవరం రూరల్ డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పాదక సంస్థల ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ మాధవ రావు తెలిపారు. తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ వైయస్ఆర్ జిల్లాలకు చెం దిన 17 రైతు ఉత్పాదక సంస్థల రికార్డులను హుకుంపేటలో గల సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో తనిఖీ చేశారు. వ్యవ సాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన వ్యవసాయశాఖ అధికారులు వెంక టేశ్వర్లు, కె.లక్ష్మారెడ్డి, సర్టిఫికేషన్ ఏజెన్సీ అధికారి జి.యుగందర్ సభ్యుల రికార్డులను పరిశీలించారు. సమావేశంలో మాధవరావు మాట్లాడుతూ రైతు ఉత్పాదక సంఘం ఉత్పత్తులను ప్రస్తుతం పరిశీలించి ప్రయోగశాలకు పంపుతామ న్నారు. అక్కడ సంతృప్తి చెందినట్లు నిర్ధారిస్తే ప్రపంచంలోని పలు దేశాల్లో ఎక్కడైనా వ్యవసాయ ఉత్పత్తులు అమ్ముకొనే అవకాశం వుందన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవ సాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, కె.బాబూ రావు, వ్యవసాయాధికారులు భీమరాజు, శాంతా ఆలివ్, షేక్ కాశిం, మేరీకిరణ్, ప్రశాంతి, రఘుకుమార్, రాబిన్ సింగ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

మంగళ, గురువారాల్లో కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం జీజీహెచ్‌లోని ప్రివెంటివ్ అంకాలజీ సెంటర్లో ప్రతి మంగళ, గురువారాల్లో కేన్సర్ రోగులకు స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ అన్నారు. గురువారం జీజీహెచ్‌లోని ప్రివెంటివ్ అంకాలజీ ఓపీడీ 222ను రాష్ట్ర ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ శ్యామల, డబ్ల్యుహెచ్ అధికారి డాక్టర్ పాటిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నోటి కేన్సర్, గర్భాశయ కేన్సర్ నిర్ధారణ పరీక్షలతోపాటు వైద్యులు రోగులకు అందిస్తున్న చికిత్సలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడారు. అనంతరం దంత, సర్జరీ, గైనిక్ విభాగపు వైద్యులు నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ హరిశ్చంద్ర, డీపీఎం డాక్టర్ అభిషేక్, ఎపిడమాలజిస్ట్ సుధీర్, డీపీఓ సంధ్య, ఆలీ బేగ్ పాల్గొన్నారు.


మల్లయ్యపేట అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో డివైడర్ పైకి దూసుకెళ్లిన లారీ

మల్లయ్యపేటలో తప్పిన ప్రమాదం

అదుపుతప్పి డివైడర్ ఎక్కిన లారీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ పరిధిలోని మల్లయ్యపేట అంబేడ్కర్ విగ్రహం సెంటర్ మలుపు వద్ద ఒక లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే...పేడ లోడుతో వెళుతున్న లారీ రాజమహేంద్రవరం వైపు నుంచి మల్లయ్యపేట మీదుగా గామన్ బ్రిడ్జి వైపు వెళుతోంది. మల్లయ్యపేట మలుపు వద్దకు వచ్చేసరికి రోడ్డు డివైడర్‌ను లారీ ఢీకొట్టి పైకి ఎక్కేసింది. ఆ సమయంలో సెంటర్‌లో ఎవరూ లేకపోవడంలో ప్రమాదం తప్పింది. పగటి పూట జరిగి వుంటే పెద్ద ప్రమాదమే జరిగి వుండేదని స్థానికులన్నారు.

కంప్యూటర్ కోర్సుపై శిక్షణా తరగతులు

రాజానగరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్ కోర్సుపై రాజానగరం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ తరగతులు ప్రారంభించినట్టు జిల్లా మేనేజర్ పెరుమాళ్ల రావు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ టి.గణేష్ కుమార్ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కంప్యూటర్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. 18 ఏళ్ల నుంచి 40 ఏళ్లలోపు వయసు కలిగి, పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు రాజానగరం ఎంపీడీవో కార్యాలయంలోని స్కిల్ హబ్‌లో వివరాలను అందించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి. డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ నిలుపుదల చేస్తామని దేవరపల్లి విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్ వెంకట్రావు తెలిపారు.

అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలి

సీపీఎం డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణమే రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ డిమాండ్ చేశారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు జువ్వల రాంబాబు, పవన్, ఎస్ఎస్ మూర్తి, సీపీఎం నగర కార్యదర్శి రామకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సమర్థవంతంగా నిర్వహించాలి

కలెక్టర్ పి.ప్రశాంతి

కోరుకొండ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సమర్థవంతంగా చేపట్టి ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాఘవాపురంలో గురువారం జరిగిన రెవెన్యూ గ్రామ సదస్సును ఆమె ఆకస్మికంగా సందర్శించారు.ఈసందర్భంగా గ్రామ రెవెన్యూ సమస్యలపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబరు 12నుంచి రెవెన్యూ సదస్సులు మొదలయ్యాయని, జనవరి 8 వరకు సదస్సులు నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో రూట్‌మ్యాప్ సిద్ధం చేశామని తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించే సమయంలో రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సంబంధిత గ్రామాలకు చెందిన భూ రికార్డులన్నీ అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 101గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించామన్నారు. ఈసందర్భంగా ప్రజల నుంచి 1235అర్జీలు అందాయన్నారు. వాటిలో ఇప్పటి వరకు 183అర్జీలు పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. అర్జీల పరిష్కార విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈసందర్భంగా కోరుకొండ తహశీల్దార్ వి.సుస్వాగతం, కోరుకొండ మండలం రెవెన్యూ సదస్సుల వివరాలను కలెక్టర్‌కు తెలిపారు. మండల పరిధిలో గురువారం 12మంది అర్జీలు ఇచ్చారన్నారు. ఇప్పటివరకు రెవెన్యూ సదస్సుల ద్వారా 49 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. సమావేశంలో రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రాఘవాపురం రెవెన్యూ సదస్సులో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సదస్సులను సద్వినియోగం చేసుకోండి

గోకవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాయుడు అన్నారు. మల్లవరంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసికొచ్చి పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు. రైతుల నుంచి 12దరఖాస్తులు అందినట్లు తహశీల్దారు సాయిప్రసాద్ తెలిపారు.

నేటి నుంచి వ్యవసాయ సదస్సు

రాజానగరం, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ యూనివర్శిటీ (జీజీయు)లో స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల20 నుంచి రెండు రోజులు వ్యవసాయ ఆవిష్కరణ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి యు.చంద్రశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ దేశంలో అత్యధికులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, వీరిలో 88శాతం సన్న, చిన్న కారు రైతులే ఉన్నారన్నారు. సాంకేతిక రంగం దినదినాభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో సాంకేతికతను ఉపయోగించి రైతులకు ఎంతో మేలు చేయవచ్చన్నారు. వ్యవసాయ రంగంలో ఎన్నో వినూత్న పద్ధతులను అవలంభించి వ్యవసాయ పరిశ్రమాభివృద్ధిని మరింత శక్తివంతం చేసే ఉద్దేశంతో ఈసదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈసదస్సులో వ్యవసాయ పరిశోధకులు, ఇంకుబేటర్లు, వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా కల్చర్ శాస్త్రవేత్తలు, ఎన్జీవోలు, నాబార్డు అధికారులు, వ్యవసాయ పారిశ్రామికవేత్తలుపాల్గొంటారని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ వినతి

కడియం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గురువారం కాకినాడ కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో షెడ్యూల్ కులాల ఉపవర్గీకరణ ఏక సభ్యకమిషన్ చైర్మన్ రాజీవ్ మిశ్రాకు వినతిపత్రం అందచేసినట్లు పొట్టిలంక అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు నక్కా వెంకటరత్నరాజు తెలిపారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏపీలో 80లక్షల మందిపైగా ఉన్న మాలల మనోభావాలను, వారు వర్గీకరణను వ్యతిరేకిస్తున్న విధానాలను పరిగణలోకి తీసుకుని సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ చేయకూడదని అభ్యర్థించారు. మాలలు నేటికి అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నందున ఎస్సీ కులాల వర్గీకరణ ప్రయత్నాన్ని పూర్తిగా విరమించు కోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. వినతిపత్రం అందచేసిన వారిలో అంబేడ్కర్ యువజన సంఘం కార్యదర్శి నక్కా చంటిబాబు తదితరులు ఉన్నారు.

బడి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు

సీతానగరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఆరోగ్య స్వాత్స కార్యక్రమంలో భాగంగా సీతానగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఏ.వీ.కె చైతన్య ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇనుగంటివారిపేట గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ ఏ.సురాణి విదార్థినీ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే వారికి వెంటనే తగిన వైద్యసేవలు అందిస్తామని తెలిపారు.

ముగిసిన కోట సత్తెమ్మ తిరునాళ్లు


ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోనున్న కోటసత్తెమ్మ అమ్మవారి తిరునాళ్లు 15న ప్రారంభవగా, గురువారం సాయంత్రంతో ముగిశాయి. అమ్మవారికి ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలతో పాటు ఉదయం చండీ పారాయణం, సాయంత్రం చండీ హోమం జరిపారు. సాయంకాలం ఆలయంలో గరగ నృత్యాలు, సన్నాయిమేళం, కూచిపూడి, జానపద ప్రదర్శనలు జరిపారు. మరోపక్క కేరళ చండామేళం, కాళికా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. ఆలయ ప్రాంగణంలో భక్త సమాజం మహిళలతో కోలాట ప్రదర్శనలు జరిగాయి. అనేక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అధికారులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

నిడదవోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో గురువారం మధ్యాహ్నం రైల్వేట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన రాకుర్తి నాగ్రేందరావు(54) మృతి చెందాడు. మృతుడు రాజమండ్రిలోకి ఒక హాస్పటల్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్టు జీఆర్‌పీ ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు.

లోకేశ్ యువగళం ఏడాది పూర్తి కావడం ఆనందదాయకం

పెందుర్తి అభిరామ్

కోరుకొండ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 5 కోట్ల ప్రజల అభిమానం, లోకేశ్ సొంతమని, లోకేష్ యువగళం పాదయాత్రకు ఏడాది పూర్తి కావడం ఆనందంగా ఉందని సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్, తనయుడు పెందుర్తి అభిరామ్ పేర్కొన్నారు. గురువారం కోరుకొండలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేరువ అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో మంచి ప్రభుత్వం అంటే చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లతోనే సాధ్యమన్నారు. విలేకరులపై అభిమానం ఉందని, తనపై తప్పుడు ఆరోపణలు చేయవద్దని, తనపై బురద జల్లే వారిపై చర్యలు కచ్చితంగా ఉంటాయని పెందుర్తి అభిరామ్ పేర్కొన్నారు.

నేడు శిక్షణా తరగతులు

రాజానగరం, డిసెంబరు 19 (ఆంధ్ర జ్యోతి): గ్రామపంచాయతీల అభివృద్ధిపై శుక్రవారం ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జేఏ ఝాన్సీ గురువారం తెలిపారు. ఉదయం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

పిండి నల్లి, ఎర్ర నల్లిపై శాస్త్రవేత్తల సర్వే


సింగంపల్లిలో రైతులకు ఎర్రనల్లి గురించి అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సంపత్‌కుమార్

రంగంపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సింగంపల్లి గ్రామంలో కర్రపెండలం తోటలో పిండి నల్లి గురించి ఐకార్, బెంగళూరు శాస్త్రవేత్త ఎం.సంపత్‌కుమార్, హెచ్‌ఆర్ఎస్ పెద్దాపురం శాస్త్రవేత్త పి.సునీత గురువారం సర్వే చేశారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఫెనాకోకస్ మనిహోతి అనే పిండినల్లి రకం మన ప్రాంతంలో లేదని, కాని తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఈ రకమైన పిండినల్లి సమస్య అధికంగా ఉండటంతో రైతులు విత్తనానికి వాడే కర్రని (స్టైమ్‌కటింగ్) తీసుకునేటప్పుడు జాగ్రత్తలు వహించాలని ఆయన సూచించారు. పి.సునీత మాట్లాడుతూ ఎర్రనల్లి సమస్య మన ప్రాంతాల్లో ఉందని, దాని నివారణకు లీటరు నీటిలో స్పిరోమెసిఫెన్ 0.6ఎంఎల్ మందును కలిపి పిచికారి చేయాలని రైతులకు సూచించారు. ఈసర్వేలో ఉద్యానవనాధికారి కె.దివ్యశ్రీ, హెచ్‌ఈవో అరవింద్, వీహెచ్ఏ రామకృష్ణ, గ్రామ రైతులు వేగిశెట్టి వెంకటరత్నం, గుడాల దుర్గాప్రసాద్, యానాల సూరిబాబు పాల్గొన్నారు.

పరామర్శ

గోకవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): శివరామపట్నంలో జనసేన నాయకుడు గాబు రామకృష్ణ కుమార్తె ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆ కుటుంబాన్ని గురువారం పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు.

మూలారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం


రామవరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అనపర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రామవరంలో పంచాయతీ కార్యాలయంలో గురువారం నల్లమిల్లి మూలారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా శిబిరాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి ప్రారంభించారు. ఈశిబిరంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల వైద్యులు డాక్టర్ నాగరాజు, శ్రావణి, డాక్టర్ అరవింద్, మోహన్ తదితరులు వైద్య సేవలందించారు. 90మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పది మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరిని శుక్రవారం నిడదవోలుకు తరలించి శనివారం ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, గొలుగూరి వీర్రాఘవ రెడ్డి, నల్లమిల్లి గోపాలకృష్ణారెడ్డి, మూలారెడ్డి, చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

'కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి'

గోకవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని వైసీపీ ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు అన్నారు. గోకవరంలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ అమిత్‌షా మాట్లాడిన మాటలను వెంటనే పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండు చేశారు. అంబేడ్కర్‌ను అవమానపర్చిన అమిత్ షాను ప్రధాన మంత్రి మోదీ సమర్థించడం సమంజసం కాదన్నారు. అంబేడ్కర్‌పై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు మళ్లీ పునరావృతం కాకుండా రాష్ట్రపతి ఆదేశాలు జారీ చేయాలని ఏడుకొండలు విజ్ఞప్తి చేసారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20,21 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని విద్యుత్ ఏఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఏడీబీరోడ్డు విస్తరణ పనులు, చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో 33/11కేవీ వడిశలేరు సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11కేవీ వడిశలేరు టౌన్‌ఫీడర్, రూరల్‌ఫీడర్‌కు సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. వడిశలేరు, ముకుందవరం గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

రాజానగరంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నందరాడ విద్యుత్ సబ్‌స్టేషన్ 33/11కేవీ నుంచి సరఫరా అయ్యే అన్ని 11కేవీ ఫీడర్లకు వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరా యం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. నందరాడ, నరేంద్రపురం గ్రామాలకు ఉద యం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలన్నారు.



గణేశుడికి లక్ష కుడుములు

బిక్కవోలు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన తాళ్ల పిచ్చిరెడ్డి గంగా దంపతులు గురువారం లక్ష కుడుముల నోము తీర్చారు. ముందుగా స్వామి వారికి అభిషేకం, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో తయారు చేసిన లక్ష కుడుములను స్వామికి సమర్పించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి ప్రసాదంగా అందజేశారు.

ప్రజల దేవుడు అంబేడ్కర్



రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ పట్ల కేంద్ర మంత్రి అమిత్‌షా అమర్యాదగా మాట్లాడడం తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి అన్నారు.రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి గురువారం కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కోట్లాది మంది మనోభావాలు దెబ్బతీసేలా షా మాట్లాడారన్నారు. అంబేడ్కర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన అమిత్ షాను తక్షణమే చట్టసభల నుంచి బర్తరఫ్ చేయాలని స్వతంత్ర జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. వెంటనే షా క్షమాపణలు చెప్పాలన్నారు.



అమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో కోట సత్తెమ్మ తిరునాళ్ళు గురువారం ముగిశాయి. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. - 8లో

ముగ్గురు ఏపీవోలకు షోకాజ్ నోటీసులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్యాటిల్ షెడ్స్ పనులకు నిర్దేశించిన 715 షెడ్స్‌లో ఇప్పటి వరకు లక్ష్యాలను చేరుకోవడంలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు ఏపీవోలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డ్వామా పీడీని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు.కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ పనుల సమీక్షలో కలెక్టర్ క్యాటిల్ షెడ్స్‌పై ఆరా తీసారు. ఇప్పటి వరకు 73 షెడ్లు పూర్తి కాగా 40 రూఫ్‌లెవెల్, 150 బేస్‌మెంట్, 386 పునాదిలో ఉండడంపై వివరణ కోరారు. పనుల విషయంలో నిర్లక్ష్యం వహించిన రంగంపేట, కోరుకొండ, నల్లజర్ల, ఏపీవోలకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని పీడీని ఆదేశించారు. ఉపాధి హామీ పనులు డిసెంబరు నెలాఖరు నాటికి జిల్లాకి కేటాయించిన 44 లక్షల పనిదినాల్లో ఇప్పటివరకు 42లక్షల 90 వేలు పూర్తి చేశారని మిగిలినవి పూర్తి చేయాలన్నారు.సగటు వేతనం రూ.256గా చెల్లిస్తున్నామన్నారు. ఈ మొత్తం రూ.300 వరకు చేరేలా పనులు గుర్తింపు ఉండాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ పనులు నూరు శాతం జనవరి 12 కల్లా పూర్తి చేయాలన్నారు. 645 సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో 51 పూర్తికాగా 169 లేయర్ వరకు వచ్చాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.గ్రామాల వారీ పనులపై మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేపట్టాలన్నారు.సమీక్షలో డ్వామా పీడీ నాగమహేశ్వరరావు, ఇంజనీర్లు, ఏపీవోలు పాల్గొన్నారు.

అనపర్తిలో ఇద్దరు ఫీల్ట్ అసిస్టెంట్ల సస్పెన్షన్



పెడపర్తి, రామవరం ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత పాలకులు ఉపాధి నిధులను పందికొక్కుల్లా మెక్కారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం 17వ ఉపాధి హామీ సామాజిక ప్రజా వేదిక నిర్వహించారు. 2023-24 సంవత్సరంలో అనపర్తి మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి ఈ నెల 10 నుంచి సోషల్ ఆడిట్ బృందం క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదికలను తయారు చేశారు. గతేడాది కాలంలో మండలంలోని 11 గ్రామాల్లో రూ.8.40 కోట్ల నిధులు ఖర్చు చేయగా వీటిలో వేతనాలకు రూ.5.10 కోట్లు, మెటీరియల్ కోసం 3.30 కోట్లు ఖర్చు చేసినట్టు పీడీ నాగమహేశ్వరరావు తెలిపారు. పలు గ్రామాల్లో మస్తర్ల విషయంలో అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. పెడపర్తి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ బోడపాటి వినయ్ ప్రతాప్ తన తల్లి, సోదరుడి పేరున కూడా జాబ్ కార్డులు సృష్టించి రూ.2.05 లక్షలు కాజేసినట్టు గుర్తించారు. ఫీల్డ్ అసిస్టెంట్ స్వయంగా అవినీతికి పాల్పడినట్లు అధికారుల ఎదుట అంగీకరించాడు. రామవరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి విధి నిర్వహణలో అలసత్వంగా ఉన్నందున ఇరువురిని సస్పెండ్ చేశారు. మస్తర్లతో కాజేసిన రూ.2.56 లక్షలు, పెనాల్టీ రూ.22 వేలు రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఏపీవో రామ్ ప్రసాద్, ఖాదర్ బాషా, ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు వారా కుమారి, గొల్లు హేమతులసి, కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, డీసీ ఛైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

12:30 కాలేదు ఉద్యోగులు ఎక్కడమ్మా!

86వ సచివాలయానికి తాళం వేసి ఉండడంపై ఎమ్మెల్యే వాసు ఆగ్రహం



సచివాలయ రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ,డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం 45, 46 డివిజన్ల పరిధిలోని 83,84,85,86 సచివాలయాలను తనిఖీ చేసి ఎమ్మెల్యే విస్తుపోయారు. 86వ సచివాలయానికి తాళాలు వేసి ఉండడం చూసి మండిపడ్డారు. ఇంకా 12:30 గంటలు కూడా కాకుండానే సిబ్బంది ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు.అడ్మిన్ సెలవులో ఉన్నారని తెలుసుకుని..ఆపై బాధ్యత నిర్వహించాల్సిన లక్ష్మీ సూర్య అనే ఉద్యోగిని అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఫోన్ చేసి 86వ సచివాలయం ఉద్యోగులను మార్చాలని సూచించారు. వివిధ సమస్యలపై సచివాలయానికి వచ్చే ప్రజలకు ఉద్యోగులు అందుబాటులో లేకపోతే ఎవరు సమాధానం చెబుతారని ప్రశ్నించారు.మిగిలిన సచివాలయాల్లో రిజిస్టర్లను తనిఖీ చేశారు. పాతపద్ధతులు మార్చుకోవాలని సూచించారు.



కొవ్వూరు మండలం పంగిడి వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు హెల్మెట్ లేకపోవడంతో రోడ్డుకు తలతగిలి అక్కడికక్కడే ఇలా మృతిచెందాడు.

తల కెక్కించుకోండి!

హెల్మెట్ బరువు కాదు బాధ్యత

- హెల్మెట్ పెట్టుకోవాల్సిందే
- నిర్లక్ష్యాన్ని ఉపేక్షించొద్దు
- హైకోర్టు సీరియస్
- 6 నెలల్లో 84 మంది మృతి
- ఈ ఏడాదిలో 43 వేల కేసులు
- 11 నెలల్లో రూ.అర కోటి ఫైన్
- అయినా మారని జనం
- వాహనానికి హెల్మెట్ ఉచితమట?
- బిల్లుతో సరిపెట్టేస్తున్న షోరూమ్‌లు

లక్షలు పోసి బైక్‌లు కొంటారు.. వేగంగా వెళ్లిపోతారు.. హెల్మెట్ పెట్టుకోవడానికి ఇష్టపడరు.. శిరస్త్రానం అనేది బరువు కాదు బాధ్యత అని ఒక్కరూ ఆలోచించరు.. ప్రమాదాలు జరిగిన సమయంలో శరీరంలో ఎక్కడ దెబ్బలు తగిలినా దాదాపుగా ప్రాణాలకు ముప్పు ఉండకపోవచ్చు.. కానీ తలకు తగిలితే మాత్రం ఆ గ్యారంటీ లేదు.. క్షణాల్లో ఊపిరి గాల్లో కలిసిపోతోంది.. అదే హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణాలకు ముప్పు తప్పినట్టే. అయినా చిన్నచూపే.. ఈ ఏడాది 11 నెలల కాలంలో హెల్మెట్ పెట్టుకోలేని వాహనదారుల నుంచి రూ. అరకోటి వసూలు చేశారంటే నిర్లక్ష్యం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.. పోనీ ఫైన్ వేసిన పోలీసులైనా చెబుతున్నారా అంటే అదీలేదు.. ఫైన్ వేసి కనీసం హెచ్చరికలు చేయకుండా వదిలేస్తున్నారు.. దీనిపై ఉన్నత న్యాయస్థానం మండిపంది.. హెల్మెట్ ధారణపై చైతన్యం కల్పించాలని ఆదేశించింది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

చిన్నపాటి లెక్కలేనితనం కుటుంబాలను రోడ్డున పడేస్తోంది. లక్షలుపోసి వాహనాలు కొంటున్నవాళ్లు ఐదు వందలతో ప్రాణాలను నిలబెట్టే కవచం(తలకు) కొనడానికి తీవ్రంగా ఆలోచిస్తున్నారు. ప్రాణం విలువను హెల్మెట్ ఖరీదుతో పోల్చగలమా?.. హెల్మెట్ పెట్టుకోకుండా వహిస్తున్న నిర్లక్ష్యంతో ప్రతి ఏడాది వందలాది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వీరిలో యువత ఎక్కువగా ఉంటున్నారు. ఈ నిర్లక్ష్యాన్ని ఇక ఉపేక్షించేది లేదంటూ ఉన్నత న్యాయస్థానం రంగంలోకి దిగింది. హెల్మెట్ పెట్టుకోకపోతే ఖబడ్దార్ అంటూ హెచ్చరికలు జారిచేస్తోంది.

ఎంత చెప్పినా..

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, మిగతా వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలని పోలీసులు ఎంత చెప్పినా వాహన చోదకులు మాత్రం పెడచెవిన పెడుతున్నారు. కనీసం ఒక శాతం వాహన చోదకుల నెత్తిపై కూడా హెల్మెట్ కనిపించడం లేదు.హెల్మెట్ ఎక్కువసేపు పెట్టుకోవడం వల్ల చెమటచేరి జుట్టు పాడవుతుందని భయపడుతుంటారు. తలపై బరువుగా ఉన్నట్టు ఫీలవుతుంటారు. నాణ్యతా ప్రమాణాలు లేని హెల్మెట్ల వల్ల ఈ సమస్య ఉంటుంది. కాస్త ధర ఎక్కువైనా నాణ్యత కలిగిన హెల్మెట్‌ని కొనుక్కుంటే ఆ ఇబ్బంది ఉండదు.హెల్మెట్‌కి బట్టతలకు ఎలాంటి సంబంధమూ లేదని నిపుణులు చెప్పే మాట. కార్బన్, కెవ్లార్ వంటి వాటితో తయారు చేసిన ఐఎస్ఐ మార్కు నాణ్యమైన హెల్మెట్లను కొనాలి. సరైన వెంటిలేషన్ ఉన్న, తలకు తగిన సైజును ఎంపిక చేసుకోవడం వల్ల సౌకర్యంగా ఉంటుంది. హెల్మెట్ పెట్టుకోవడం బరువు కాదు.. బాధ్యతని పదే పదే గుర్తు చేసినా ఫలితం అంతంత మాత్రంగా కూడా లేదు.దీంతో కొరడా ఝుళిపించక తప్పని పరిస్థితి వచ్చేసింది. సాక్షాత్తూ హైకోర్టు సీరియస్ కావడంతో హెల్మెట్ ధారణపై యంత్రాంగం తదుపరి చర్యలకు సమాయత్తమవుతోంది. పోలీసులకు చలాన్లు రాయడంపై ఉన్న శ్రద్ధ వాహన చోదకుల్లో చైతన్యం తేవడంలో లేదనే విమర్శలు వినవస్తున్నాయి.

6 నెలల్లో 84 మంది మృతి..

ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయమై చనిపోయిన వారి సంఖ్యను చూస్తే హెల్మెట్ ప్రాధాన్యమేమిటో అర్థమవుతుంది. ఈ ఏడాది జూన్ నుంచి డిసెంబరు 15వ తేదీ వరకూ హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్ల ఏకంగా 84 మంది దుర్మరణం పాలయ్యారు. వీరిలో యువకులు ఎక్కువగా ఉండడం మరింత విచారకరమైన విషయం.ఈ ఏడాది నవంబరు వరకూ హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారిపై పోలీసులు ఏకంగా 43 వేల కేసులు నమోదు చేసి రూ.43 లక్షలు జరిమానాగా విధించారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబరు వరకూ గణాంకాలను చూస్తే ఈ స్టేషను పరిధిలో 20 కేసులు నమోదయ్యాయి.తర్వాత స్థానాల్లో కొవ్వూరు టౌన్ 18, ధవళేశ్వరం, కడియం 17 చొప్పున, గోకవరం 16, కోరుకొండ 14, ప్రకాశ్ నగర్, రాజానగరం, పెరవలి 12 చొప్పున,నిడదవోలు 11, సమిశ్రగూడెం, దేవరపల్లి, బొమ్మూరు 10, నల్లజర్ల 9, వన్‌టౌన్, బిక్కవోలు 8, అనపర్తి 7, కొవ్వూరు రూరల్, తాళ్లపూడి 6, చాగల్లు, రంగంపేట 5 చొప్పున, ఉండ్రాజవరం పీఎస్ పరిధిలో మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసుల వద్ద కూడా ద్విచక్ర వాహన ప్రమాదాల్లో తలకు గాయం కావడం వల్ల చనిపోయిన వారి వివరాలు స్పష్టం లేవని తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఓ ఆరు నెలల లెక్కలను కాగితానికి ఎక్కించారు. మిగతా వాటి కోసం కసరత్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరో (డీటీఆర్‌బీ) అనే విభాగం ఉంటుంది. డీటీఆర్‌బీని కేవలం ఒక్క ఉద్యోగి(మరో పర్యవేక్షణాధికారి)తో నెట్టుకొస్తుండడాన్ని చిత్తశుద్ధి వెక్కిరిస్తోంది.

హైకోర్టు ఆదేశాలివే..

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై.. ముఖ్యంగా హెల్మెట్లు లేకపోవడం, ఇష్టానుసారం హారన్లు మోగిస్తుండడం, బాధ్యతారహిత డ్రైవింగ్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. 'హెల్మెట్ తప్పనిసరి చేస్తూ మేం ఇచ్చిన ఆదేశాలు ఎందుకు అమలు చేయడం లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులు కఠినంగా వ్యవసహరిస్తారనే సందేశాన్ని వాహనదారుల్లోకి బలంగా పంపించాలి. పోలీసులు రోడ్ల మీదకు వచ్చి వాహన రికార్డులు తనిఖీ చేసిన పుడే అది సాధ్యమవుతుంది. సీసీ కెమెరాలపై ఆధారపడి చలానాలను విధించడాన్ని తగ్గించి అక్కడికక్కడే జరిమానా వసూలు చేస్తే పరి స్థితిలో మార్పు వస్తుంది. పోలీసులు రోడ్లపై ఉంటే క్రిమినల్ చర్యలూ తగ్గుతాయి. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులను ఎంత మాత్రమూ ఉపేక్షించవద్దు.ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబరు వరకూ హెల్మెట్ ధరించకపోవడం వల్ల రాష్ట్రంలో 667 మంది చనిపోయారు. మా ఉత్తర్వులు అమలు చేస్తే కొన్ని ప్రాణాలైనా నిలబడేవి' అని వ్యాఖ్యానించింది. పత్రికలు, టీవీలు,ఎఫ్ఎం రేడియోలు, సైన్ బోర్డులు, సినిమా హాళ్లలో ప్రకటనల ద్వారా చట్ట నిబంధనలపై ప్రజలను చైతన్యం చేయాలని పోలీసులను హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది.

బండి కొంటే..హెల్మెట్ ఉచితమట!

కేంద్ర మోటారు వాహనాల నిబంధనలు 1989లోని 138(3)(ఎఫ్) ప్రకారం ప్రతి ద్విచక్ర వాహనం అమ్మకం సమయంలో కొనుగోలుదారు డికి ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాలతో కూడిన రెండు హెల్మెట్లను ఉచితంగా ఇవ్వాల్సి ఉం టుంది. అయితే ఉచితంగా అందిస్తున్న దాఖ లాలు లేవు. వాహనదారుడికి హెల్మెట్లు ఇవ్వ కుండా రశీదులను మాత్రం ఆ రికార్డుకు జత చేస్తున్నారు. ఈ తతంగం అధికారులకు తెలిసినా 'ఎందుకో' ఏమీ పట్టించుకోవడం లేదు. అందుకే ఏడాదికి వందల్లో ద్విచక్ర వాహనాలు రోడ్లపైకి వస్తున్నా హెల్మెట్లు మాత్రం పదుల్లో కూడా కానరావడం లేదు. పైగా వాహనం కొన్న ప్పుడు హెల్మెట్ కోసమంటూ రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకూ కొనుగోలుదారుడు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఒకవేళ అలా చెల్లించని పక్షంలో బిల్లు తెచ్చుకోవాలని చెబుతున్నారు.



వర్గీకరణ వద్దు : కాకినాడలో మాలల నిరసన ప్రదర్శన



వర్గీకరణ ముద్దు : మాదిగ ఉపకులాల నినాదాలు

మార్చి 17 నుంచి పది పరీక్షలు : డీఈవో

కడియం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి 17 నుంచి జరిగే పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు. గతేడాది కడియం ఉన్నత పాఠశాల పది ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుందని, ఈ సారి జిల్లా స్థాయిలో ప్రథమస్థానాన్ని సాధించాలన్నారు.తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ సీ,డీ గ్రేడ్ విద్యార్థుల కోసం తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను ప్రారంభించారు. ఈ మెటీరియల్ డీ, సీ, ఈ, బీ ద్వారా జిల్లా అంతా పంపిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుడా సమస్యలపై నేడు ఓపెన్‌ఫోరమ్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రుడా పరిధిలో సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తున్నామని రుడా వీసీ కేతన్ గార్గ్ తెలిపారు.ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి రుడా కార్యాలయంలో అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

జీలుగుమిల్లి టూ పట్టిసీమ జాతీయరహదారి 7

వర్గీకరణం

- ఎస్సీ వర్గీకరణపై ఉపకులాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ
- కాకినాడ విచ్చేసిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- వర్గీకరణకు అనుకూలంగా.. వ్యతిరేకంగా మోహరించిన ఇరువర్గాలు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ గురు వారం కాకినాడలో ప్రజాభిప్రాయసేకరణ చేశారు.దీనికిగాను ఆయన కాకినాడ కలెక్ట రేట్‌కు విచ్చేశారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి విచ్చేసిన మాల, మాదిగ, రెల్లి,బుడగ జంగాల వంటి ఎస్సీ ఉపకులాల వారితో కలెక్టరేట్ కిక్కిరి సింది. పోటాపోటీ నిరసనలతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఎస్సీ ఉపకులాలకు సంబంధించి వర్గీకరణపై ఎస్సీ ఉపకు లాల వర్గీకరణకు నియమించిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రా వినతులు స్వీకరించారు. ఆయా కులాల నాయకులు,ప్రజలు పోటాపోటీగా ధర్నాలు, నిరసనలు చేశారు. ఎమ్మార్పీస్ పోరాట ఫలితంగా ఉమ్మడి ఏపీలో 1997లో రామచంద్ర రాజు కమిషన్ వేశారని మాదిగ సంఘాలు గుర్తుచేశారు. ఆ కమిషన్ రిపోర్టు ప్రకారం 2000 నుంచి 2004 వరకు ఉమ్మడి ఏపీలో వర్గీకరణ అమలు జరిగిందని ఆయా సంఘాలు పేర్కొన్నాయి. ఉషామెహ్రా కమిషన్ 2008లో ఎస్సీ వర్గీకరణ అవసరమని ప్రకటించారని మాదిగ సంఘాలు తెలిపారు.



కలెక్టరేట్ వద్ద బారికేడ్లు



కాకినాడలో వినతులు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

వ్యతిరేకంగా నిరసనలు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు, మాలసంఘాలు నిరసనలు తెలిపాయి. వన్ మ్యాన్ కమిషన్ గోబ్యాక్ అంటూ మాలలు నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత తలెత్తింది. 1972 గణాంకాల ప్రకారం మాలలకు రిజర్వే షన్లు కేటాయించాలని అనుకోవడం సరైనది కాదని వారు అభ్యంతరాలు తెలి పారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్ విష్ణు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. కాకినాడ జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ఇంద్రపాలెం వంతెన వరకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

ఊరెళితే ఫోన్ చేయండి

పోలీసుల పండుగ హెచ్చరిక

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఊరెళ్తున్నారా.. మీ ఇల్లు జాగ్రత్త అంటూ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తు సమావేశాలు నిర్వహిస్తున్నారు. అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్ మాట్లాడుతూ పండగ సెలవులకు ఊరెళ్లే ప్రజలు ఇంటి భద్రత, నేరనియంత్రణకు పోలీసు సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. తాళాలు వేసిన మీఇంటి భద్రతకు లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు 9493206371, 99084 54580 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

28న సీపీఎం బహిరంగ సభ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం 24వ తూర్పుగోదావరి జిల్లా మహాసభలు ఈ నెల 28, 29 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగనున్నాయని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.అరుణ్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం శ్యామలాసెంటర్‌లోని సీపీఎం కార్యాలయం వద్ద జిల్లా మహాసభల లోగోను ఆవిష్కరించారు.డిసెంబరు 28న ప్రజాప్రదర్శన మధ్యాహ్నం 2 గంటలకు మున్సిపల్ స్టేడియం నుంచి కోటిపల్లి బస్టాండు సెంటర్ వరకూ జరుగుతుందని, అనంతరం కోటిపల్లి బస్టాండు సెంటర్లో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. 29న జరిగే ప్రతినిధుల సభకు ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ముగిసిన కోట సత్తెమ్మ తిరునాళ్ల ఉత్సవం

నిడదవోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోనున్న కోటసత్తెమ్మ అమ్మవారి తిరునాళ్లు 15న ప్రారంభవగా, గురువారం సాయంత్రంతో ముగిశాయి. అమ్మవారికి ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజలతో పాటు ఉదయం చండీ పారాయణం, సాయంత్రం చండీ హోమం జరిపారు. సాయంకాలం ఆలయంలో గరగ నృత్యాలు, సన్నాయిమేళం, కూచిపూడి, జానపద ప్రదర్శనలు జరిపారు. మరోపక్క కేరళ చండామేళం, కాళికా నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణంలో భక్త సమాజం మహిళలతో కోలాట ప్రదర్శనలు జరిగాయి. అనేక ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు అధికార, అనధికారులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ అమ్మవారు

వైసీపీ వలసలను చేర్చుకోవద్దు

టీడీపీ మాజీ జిల్లా కార్యదర్శి రంగారావు

కొవ్వూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ వలసలను కూటమిలో చేర్చుకోవద్దని తెలుగుదేశం పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి కేవీకే రంగారావు కోరారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలను ఎన్‌డీఏ కూటమిలో చేర్చు కోవద్దని ఆయన సూచించారు. కష్టకాలంలో కూటమి పార్టీల జెండా మోసిన కార్యకర్తలు, నాయకులకు న్యాయం జరగదన్నారు. వారివల్ల కూటమి ప్రభుత్వంలో లేనిపోని ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. పార్టీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విధాలా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. కష్టకాలంలో పార్టీకి పనిచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని ఆయన కోరారు.

వైద్యురాలి నిర్లక్ష్యంపై బాధితుల ఆగ్రహం

గోపాలపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ వేడినీళ్లుపడి శరీరం కాలిన ఘటనలో ఆసుపత్రికి వచ్చిన రోగిపట్ల డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారని రోగి బంధువులు గురువారం విలేకరులకు తెలిపారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం...తాళ్ళపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన ఎలిపే ఇందిరమ్మ బుధవారం రాత్రి ఇంట్లో వంట తయారు చేసే సమయంలో వేడినీళ్ల మీదపడ్డాయన్నారు. శరీరం కాలిపోవడంతో వెంటనే ఆమెను గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి అర్థరాత్రి సమయంలో తీసుకొచ్చినట్టు వారు తెలిపారు. విధుల్లో ఉండాల్సిన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తెల్లవార్లూ కాలిన గాయాలతో బాధపడుతూనే ఉందన్నారు. ఆసుపత్రి సిబ్బంది కొంతమేర వైద్యం అందించినప్పటికి బాధితురాలికి పూర్తి స్థాయిలో వైద్యసేవలందించలేదన్నారు. గురువారం ఉదయం ఆసుపత్రికి వచ్చిన వైద్యులు ఆమెను పరిశీలించి శరీరం 20 శాతం కాలిపోయిందని రిజిస్టర్ పరిశీలించగా బాధితురాలి పేరు రిజిస్టర్‌లో నమోదు కాకపోవడంతో నివ్వెరపోయినట్టు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తీసుకెళ్లాలని వైద్యులు సూచించారని తెలిపారన్నారు. దీంతో ఆగ్రహించిన బాధితురాలి బంధువులు వైద్యు రాలిని నిలదీయగా హడావిడిగా వైద్యం అందించి గురువారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం తరలించినట్టు తెలిపారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ వైద్యుడు చైతన్య రాజును వివరణ కోరగా డ్యూటీ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యురాలికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు ఆయన తెలిపారు.


కాకినాడలో కమిషన్‌కు వినతిపత్రం ఇస్తున్న చాగల్లుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణ కోసం కమిషన్‌కు వినతి

కొవ్వూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల్లో ఉన్న 59 కులాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని మాదిగ సంక్షేమ సంఘాల జేఏసీ సభ్యుడు పెనుమాక జయరాజు డిమాండ్ చేశారు. ఇటీవల సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు ఆర్.ఆర్.మిశ్రా గురువారం కాకినాడ కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై ప్రజలు, ఉద్యోగులు, వివిధ కుల సంఘాల నాయకుల నుంచి వినతులు స్వీకరించారు. కొవ్వూరు నుంచి మాదిగ సంక్షేమ సంఘం నాయకులు పెనుమాక జయరాజు, కండెల్లి భీష్మగంగేయుడు, తిగిరిపల్లి సాల్మన్‌రాజు, బొల్లిపో మదు, గెడ్డం సురేష్, వినోద్‌కుమార్ కమిషన్‌కు వినతిపత్రం అందించారు.

చాగల్లు: ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం నియమించిన కమిషన్‌కు మండలం నుంచి రిటైర్డ్ ఉద్యోగులు, ఎంఆర్‌పీఎస్ అనుబంధాల సంఘాలు కాకినాడలో వినతిపత్రం అందించారు. రిటైర్డ్ ఉద్యోగులు టి.సాల్మన్‌రాజు, ప్రభుత్వ ఉద్యోగులు బి.మధుశేఖర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మనెల్లి నాని, గెడ్డం సురేష్, గాలింకి రాము తదితులు పాల్గొన్నారు.

బదిలీ అయిన పోలీస్ సిబ్బందికి సత్కారం

ఉండ్రాజవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్ నుంచి బదిలీ అయిన కానిస్టేబుళ్లకు ఎస్ఐ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సన్మానం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. కొవ్వూరు, తాళ్లపూడి, పెరవలి మండలాలకు బదిలీ అయిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కె.రమేష్, జయరాం, వై.రాజు, ఎం.ముత్యాలరావు, కె.సత్య నారాయణ, వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బదిలీ అయిన పోలీస్ సిబ్బందిని సత్కరించిన దృశ్యం



కొవ్వూరు మండలం పెనకనమెట్ట రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహశీల్దార్ దుర్గాప్రసాద్. పక్క చిత్రంలో పెరవలి సమావేశంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహశీల్దార్ అచ్యుత కుమారి

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

చాగల్లు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భూ వివాదాలు పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం చాగల్లులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల సమస్యలు తెలుసుకున్నారు. సదస్సులో వివిధ సమస్యలపై అధికారులు 18 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. మెరికమ్మ, ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, తెలుగుదేశం నాయకులు ఆళ్ళ హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్, కరుటూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కొవ్వూరు తహశీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్ అన్నారు. గురువారం కొవ్వూరు మండ లం పెనకనమెట్ట గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరిపారు. అంతకు ముందు తహశీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల శ్రీనివాస్, పలువురు రైతులు పాల్గొన్నారు.

పెరవలి: కొత్తపల్లి అగ్రహారంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహశీల్దార్ అచ్యుత కుమారి ఎస్సీ కాలనీల్లో పర్యటించి రెవెన్యూ సదస్సు ప్రాముఖ్యత తెలిపారు. అనంతరం సచివాలయం వద్ద సమావేశం జరిపారు. వివిధ సమస్యలపై 30 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో సర్పంచ్ బండారు వెంకట రమణ సాయి బాబు, అబ్బిశెట్టి సత్తిరాజు, మారిశెట్టి పోతురాజు, వీఆర్వో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: రెవెన్యూ సదస్సుల్లో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు వీలుంటుందని తహశీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. దుద్దుకూరు గ్రామానికి చెందిన అంగారపు రాములు, అంగరపు లక్ష్మణ్, పేరిశెట్టి ఆదిలక్ష్మి, కలిదిండి సూర్యకాంతం తదితరులు తమ భూముల అడంగల్ 1బీకి దరఖాస్తు చేసుకోగా వెంటనే సభలో సర్టిఫికెట్లు అందజేశామని ఆమె తెలిపారు. రెవెన్యూ సదస్సులో 12 దరఖాస్తులు వచ్చాయని వాటిని తక్షణం పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా నాగమణి, టీడీపీ నాయకులు ముళ్లపూడి దొరాజీ చౌదరి, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లి మండలం దుద్దుకూరులో రైతులకు అడంగల్ పత్రాలు అందిస్తున్న తహశీల్దార్ రాజ్యలక్ష్మి

గోపాలపురం: రెవెన్యూ సదస్సుల్లో నమోదైన భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహశీల్దార్ కే. అజయ్‌బాబు అన్నారు. మండలంలోని భీమోలు గ్రామ సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు జరిపారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి, వీఆర్వో సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలకు మెటీరియల్ దోహదం

ఉండ్రాజవరం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు స్టడీ మెటీరియల్ ఉపయోగమని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఐ.రాంబాబు పేర్కొన్నారు. ఉండ్రాజవరం హైస్కూలు పదో తరగతి విద్యార్థులు 160 మందికి ఆయన ఆర్థికసాయంతో గురువారం స్టడీ మెటీరియల్ అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం దొమ్మేరు 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11కెవి దొమ్మేరు లోకల్, 11 కేవీ దొమ్మేరు సావరం, 11 కేవీ కాపవరం ఫీడర్ల వార్షిక మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ నిడదవోలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. దొమ్మేరు, దొమ్మేరు సావరం, కాపవరం, పెనకనమెట్ట గ్రామ ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కొవ్వూరు రూరల్ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

చాగల్లులో నేడు, రేపు

మండల కేంద్రమైన చాగల్లులో శుక్ర, శని వారాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ ఎస్.త్రిమూర్తులు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. దీనివల్ల చాగల్లు, నెలటూరు, మీనానగరం గ్రామాలతో పాటుగా వ్యవసాయ ఫీడర్లు అమ్మిగుంట, ఊనగట్ల, నెలటూరులకు కరెంట్ సరఫరా ఉండదన్నారు

దేవరపల్లిలో..

దేవరపల్లిలో శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ నిలుపుదల చేస్తామని దేవరపల్లి విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్ వెంకట్రావు తెలిపారు. ప్రజలు దీన్ని గమనించి సహకరించాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెరవలి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గత నెల 22న ఖండవల్లి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజమండ్రిలోని రాజేంద్రనగర్‌కు చెందిన బండారు నరేష్ కుమార్ (60) తాపీపని నిమిత్తం గతనెల 22న ఖండవల్లి వచ్చాడు. సాయంత్రం సమయంలో రాజమండ్రి వెళ్లడానికి జాతీయ రహదారిపైకి రాగా తణుకు నుంచి రావులపాలెం వెళుతున్న నరేష్‌కుమార్‌ను ఢీకొట్టింది. దీంతో కుడికాలుకు గాయాలుకాగా వెంటనే అతన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అతని సోదరుడు బండారు సత్యనారాయణ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితంలేని వ్యక్తి మృతి

గోపాలపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం శివారులో మతిస్థిమితంలేని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ కే.సతీష్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం బోడిగూడెం గ్రామానికి చెం దిన జక్కు గంగరాజు(50) మతిస్థిమితం లేక కొద్దిరోజులుగా ఇంటి నుంచి వెళ్లాడన్నారు. గురువారం మధ్యాహ్నం సమయంలో గోపాలపురం శివారులో కనకదుర్గమ్మ ఆలయం ఎదుట అనారోగ్యంతో మృతి చెందగా, మృతుని బంధువులకు అప్పగించామన్నారు.

ముగిసిన ఉత్సవాలు

తాళ్లపూడి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రక్కిలంక గ్రామంలోనున్న భక్తాంజనేయ స్వామి జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఆలయం వద్ద అన్నసంతర్పణ జరిపారు. ఆలయ ధర్మకర్తలు సోలస కాశీ విశ్వనాథం, సొలస గిరిధరగాంధీ మాట్లాడుతూ 23 ఏళ్లుగా భక్తుల సహకారాలతో విజయవంతంగా వీటిని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి మంగళవారం భక్తులకు అన్నదాన నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

నిడదవోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో గురువారం మధ్యాహ్నం రైల్వేట్రాక్ దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన రాకుర్తి నాగ్రేందరావు(54) మృతి చెందాడు. మృతుడు రాజమండ్రిలోకి ఒక హాస్పటల్‌లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్‌పీ ఎస్ఐ పి.అప్పారావు తెలిపారు.


సమిశ్రగూడెంలో దివ్యాంగ క్రీడాకారుడు వరప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎంపీడీవో లక్ష్మీనారాయణ

భవిత కేంద్రంలో దివ్యాంగ వేడుకలు

నిడదవోలు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రోత్సాహాన్ని అందిస్తే వారికి సాటి మరెవరు లేరని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి డి.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం సమిశ్రగూడెంలోని భవిత కేంద్రంలో మీతోడు దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిపారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి వారికి అందించారు. అనంతరం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిపిన ఆటల పోటీల్లో ప్రతిభ కనపరచిన వంగా కృపానంద వరప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాగులపల్లి లక్ష్మణరావు, ఎండి నిషా, ఏవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు ఈవోపీఆర్ అండ్ ఆర్డీ ఉమామహేశ్వరశర్మ. పక్క చిత్రంలో దేవరపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ రాజారావు

సుస్థిర అభివృద్ధి, ప్రణాళికతో గ్రామాభివృద్ధి

కొవ్వూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి, ప్రణాళికతోనే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని కొవ్వూరు ఈవోపీఆర్ అండ్ ఆర్డీ కె.ఉమామహేశ్వరశర్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 3వ బ్యాచ్‌కు మండలంలోని వేములూరు, తోగుమ్మి, వాడపల్లి, మద్దూరు, సీతంపేట, మద్దూరులంక గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులకు రెండు రోజుల శిక్షణ తరగతులను జరిపారు. సభలో ఈవోపీఆర్ అండ్ ఆర్డీ కె.ఉమామహేశ్వరశర్మ సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు

దేవరపల్లి: గ్రామాల్లో పారిశుద్యం, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈఓపీఆర్డీ రాజారావు అన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులు జరిపారు. సభలో ఈఓపీఆర్డీ రాజారావు మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు, సర్పంచ్‌లు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమారి, పీఆర్ఏఈ వినోద్‌కుమార్, మండల పరిషత్ సూపరిండెంటెంట్ జీ.శాంతి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై అవగాహన

నల్లజర్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో సుస్థిర అభివృద్ధిపై కార్యాచరణ ప్రారంభించాలని ఎంపీడీవో సింహాద్రిరావు అన్నారు. గురువారం నల్లజర్ల మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం జరిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనులు గుర్తించి మండల పరిషత్ దృష్టికి తీసుకుని వస్తే నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు.


వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులో డిజిటల్ లావాదేవీలను ప్రారంభిస్తున్న జెసీ చిన్నరాముడు, ఎమ్మెల్యే ముప్పిడి

వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టులో డిజిటల్ లావాదేవీలు ప్రారంభం

కొవ్వూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పన్నుల వసూలుకు ప్రభుత్వం నూతన ప్రక్రియ ప్రారంభించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. కొవ్వూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులో గురువారం డిజిటల్ లావాదేవీలను జేసీతో పాటు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లా ప్రప్రథమంగా పైలట్ ప్రాజెక్టుగా కొవ్వూరు గామన్ వంతెన వద్ద ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులో డిజిటల్ చెల్లింపులను ప్రారంభించామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల పంటలను ఇతర ప్రాంతాలకు తరలించే సమయంలో మార్కెట్ కమిటీకి పన్ను చెల్లించాలన్నారు. ఇప్పటి వరకు పన్నులను నగదులో చెల్లించే వారని, నేటి నుంచి డిజిటల్ లావాదేవీలు జరపవచ్చునన్నారు. కొవ్వూరు ఏఎంసీ ద్వారా సంవత్సరానికి రూ. 1.60 కోట్లు పన్నులు వసూలు అవుతున్నాయన్నారు. మండలంలోని కాపవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గోదాములు త్వరితగతిన పూర్తిచేసి, చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐడి ఏడి మార్కెటింగ్ ఎం. సునీల్ వినయ్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ కె.తిలక్‌కుమార్ తెలిపారు. దీనిపై సీతానగరం, కోరుకొండ పాఠశాలల్లో బుర్రకథ నిర్వహించారు. నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరం హైస్కూల్‌లో పిల్లలకు విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం టౌన్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు.



కొవ్వూరు మెరకవీధి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నాయకులు. పక్క చిత్రంలో నిడదవోలులో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు, కార్యకర్తలు

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసనల వెల్లువ

కొవ్వూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలను మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బి.శ్యాం రవిప్రకాష్ ఖండించారు. కొవ్వూరు మెరకవీధిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేడ్కర్‌ను అవమానపరుస్తూ మాట్లాడటం అమిత్‌షాకు తగదన్నా రు. ఆయన తన పదవికి రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.రాజబాబు, ఎం.ఆనంద్, బి.కిరణ్, కె.మురళి, ఎం. బంగార్రాజు, బి.లక్ష్మణరావు, బి.భానుప్రకాష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా చిత్రపటం దహనం

నిడదవోలు: పార్లమెంటులో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు అన్నారు. గురువారం నిడదవోలులో కేవీపీఎస్, చర్చిపేట యూత్ ఆధ్వర్యంలో అమిత్‌షా చిత్రపటాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో మోషే, రమేష్, శేఖర్, పెద్దిరాజు, రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఎం నాయకులు ఎస్.భగత్ డిమాండ్ చేశారు. దేవరపల్లి మండలం త్యాజంపూడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం పలువురు ఆందోళన చేపట్టారు. జమిలీ ఎన్నికలు నిర్వహించటం ద్వారా దేశంలో ప్రాంతీయ పార్టీలను నాశనం చేయాలని బీజేపీ కుట్ర పన్నిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వారా కృష్ణారావు, అయినపర్తి శ్రీనివాసరావు, అంబేడ్కర్ యూత్ నాయకులు మానుపాటి రామకృష్ణ, మరపట్ల రత్తయ్య, వారా అబ్బులు, ఇప్పర్తి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


దేవరపల్లి: త్యాజంపూడిలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, అంబేడ్కర్ యూత్